# యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ (UPF)

1-9-52/E/3, రాంనగర్, హైదరాబాద్ - 500 020. (T.S.) INDIA. Ph.: 9550504718, 9030757571

# దెబోరా స్వరం

సంపుటి : 16 సంచిక : 3 మే - జూన్ 2023 విడి ప్రతి వెల రూ. 5/- సం॥ర చందా రూ॥ 100/-


హృదయ పరీక్ష శీర్షిక నుండి

## 24. అహంకారదృష్టి

- జాయ్ చెరియన్

*సంపాదకురాలి కలమునుండి...*

దెబోరాస్వరం పాఠకులకందరికీ శుభములు.

అహంకారదృష్టి గలవారెప్పుడూ తామే గొప్పవారమని, తమ్మును మించినవారు లేరని గర్విస్తారు. అలాంటివారిని దేవుడు ద్వేషిస్తాడు. అహంకారదృష్టిగలవారు యెహోవాకు హేయులు.

**"యెహోవాకు అసహ్యములైనవి ఆరు గలవు. ఏడును ఆయనకు హేయములు అవేవనగా, అహంకారదృష్టియు కల్లలాడు నాలుకయు నిరపరాధులను చంపు చేతులును దుర్యోచనలు యోచించు హృదయమును కీడు చేయుటకు త్వరపడి పరుగులెత్తు పాదములును లేనివాటిని పలుకు అబద్ధసాక్షియు అన్నదమ్ములలో జగడములు పుట్టించువాడును."**

– సామెతలు 6:16-19

దేవుడు అసహ్యించుకొని ద్వేషించే హేయకార్యములలో అహంకారదృష్టి ఒకటి. అహంకారదృష్టిగలవారు భూమిపై పాదములు పెట్టి నడవరు గాని, తమకు తామే గొప్పగా యెంచుకుంటూ ఆకాశములో విహరిస్తుంటారు. వారి వస్త్రధారణ, మాటలు, నడతను చూడగానే మనకు తెలిసిపోతుంది వారెంత అహంకారులో. పొగరుపట్టిన మాటలు మాట్లాడుతూ ఇతరులను హీనముగా చూస్తూ కించపరుస్తుంటారు. ఇతరులను విమర్శిస్తూ నిందలు మోపుతారు. అహంకారులు – పరులజోలికి పోవడము, లేని వార్తలు పుట్టించడము, అభిషిక్తులను ముట్టుకోవడము, అబద్ధములు మాట్లాడుతూ అన్నదమ్ములలో జగడములు పుట్టించేవారుగా ఉంటారు. సంఘములను పాడుచేస్తారు. అహంకారదృష్టి గలవారికి బొత్తిగా దైవభయము ఉండదు.

**"మరియు యెహోవా సెలవిచ్చునదేమనగా – సీయోను కుమార్తెలు గర్విష్ఠురాండ్రై మెడచాచి నడచుచు ఓర చూపులు చూచుచు కులుకుతో నడచుచు, తమ కాళ్లగజ్జలను మ్రోగించుచున్నారు;"** – యెషయా 3:16

సీయోను కుమార్తెలు గర్విష్ఠురాండ్రై దైవభయము లేకుండా అహంకారముతో ఓర చూపులుచూస్తు, మెడచాచి నడుస్తు తమ కాళ్లగజ్జలు మ్రోగిస్తు కులుకుతు నడుస్తు తమ వైభవమును ప్రదర్శిస్తున్నారు. కాబట్టి అట్టి స్త్రీల తలను బోడితలగా చేస్తాను అని దేవుడంటున్నాడు. దేవునికంటే ఎక్కువగా తమ అందమును, వెండి, బంగారములను, సిరిసంపదలను ప్రేమించేవారు చివరకు ఏమీ లేనివారై నేలకూర్చుంటారని యెహోవా దేవుడు సెలవిస్తున్నాడు (యెషయా 3:16-26 వచనములు). దేవునియందు భయభక్తులుగల స్త్రీలు అణకువ కలిగి తమ్మును తాము తగ్గించుకొని, పరిశుద్ధతే వారి అలంకారముగా ఉంటే, దేవుడే వారికి భూషణముగా ఉంటాడు. కొందరు విశ్వాసులేగాని బొత్తిగా దైవభయం లేకుండా కాళ్ల గజ్జలు వేసికొని ఆరాధనకు వస్తారు. నీ కాళ్ళగజ్జలు మ్రోగినప్పుడు ఇతరుల దృష్టి దేవునిమీదనుండి మరలి నీతట్టు చూస్తారు. కాబట్టి దేవుని సన్నిధికి వెళ్లునప్పుడు గజ్జలు ధరించకూడదు. అహంకారదృష్టి కలిగి గర్వముగా ప్రవర్తిస్తుండేవారు చివరకు ఏమీ లేనివారవుతారు. కాబట్టి నీలో అహంకారము, గర్వముంటే తొలగించుకొని దైవభయము కలిగి వినయమనస్కులై యుండడము నేర్చుకోవాలి. కొందరు స్త్రీలు, పురుషులు అహంకారదృష్టితో పరులజోలికి వెళుతు వారిని తక్కువగా అంచనా వేస్తు అవమానపరుస్తుంటారు.

**"తనకు పట్టని జగడమునుబట్టి రేగువాడు దాటిపోవుచున్న కుక్క చెవులు పట్టుకొనువానితో సమానుడు."** – సామెతలు 26:17

అనవసరముగా పరులజోలికి పోకూడదు. అట్టివారు దాటిపోవుచున్న కుక్క చెవులు పట్టుకున్నవానితో సమానమని అంటున్నాడు. కుక్క చెవులు పట్టుకుంటే తప్పకుండ కరుస్తుంది. ఇతరుల విషయములలో అనవసరముగా తలదూర్చి కీడు తెచ్చుకోకుండ నిన్ను నీవు తగ్గించుకొని దేవుని సన్నిధిలో కూర్చుని నీ కుటుంబముకొరకు ప్రార్థించాలి. నీ కుటుంబము పైకి రావాలి, దేవుడు నిన్నేవిధంగా దీవించనైయున్నాడో, నీయొద్దనుండి దేవుడు ఏమి ఆశిస్తున్నాడు అని గురిగలిగి యుండాలి.

అహంకారదృష్టిగలవారు ఎప్పుడూ ఇతరులను విమర్శిస్తుంటారు. వారికి వాక్యజ్ఞానము లేకపోయినా, ఇతరులు వాక్యము చెప్తుంటే ఆ... అతనేమి ప్రసంగము చేస్తున్నాడు? అంటూ విమర్శిస్తారు. గొప్ప అభిషిక్తులనుకూడ తక్కువగా అంచనా వేసి మాట్లాడుతారు. దేవుడభిషేకించినవారిని ముట్టుకుంటే కీడు కలుగుతుందనే దైవభయము మనలో ఉండాలి.

**"–నేనభిషేకించినవారిని ముట్టకూడదనియు నా ప్రవక్తలకు కీడుచేయకూడదనియు ఆయన ఆజ్ఞ ఇచ్చి ఆయన ఎవరినైనను వారికి హింసచేయనియ్య లేదు ఆయన వారికొరకు రాజులను గద్దించెను. దేశముమీదికి ఆయన కరవు రప్పించెను జీవనాధారమైన ధాన్యమంతయు కొట్టివేసెను."** – కీర్తనలు 105:14-16

దేవుని కార్యములు జరిగించుటకొరకు కొందరిని ఎన్నుకొని, వారిని ఏర్పరచుకొని, ప్రత్యేకించుకొని వారిని దేవుడు అభిషేకించి వాడుకుంటాడు. అట్టి అభిషిక్తులను గౌరవించాలి, వారి మాట వినాలి, వారికి సహకరించాలి.

పరిశుద్ధుల అవసరతలలో పాలుపొందాలి. అలాకాకుండ వారిని విమర్శిస్తు, చులకన చేసి మాట్లాడుతుంటే కీడు కలుగుతుంది. శాపము, దేవుని ఉగ్రత అట్టివారిపైకి వస్తుంది. కాబట్టి అహంకారదృష్టితో అభిషిక్తులను దైవజనులను విమర్శించకుండ దైవభయముతో వారికి సహకరించాలి. అహంకారదృష్టి నీలోనుండి తొలగించుకోవాలి.

అహంకారదృష్టి గలవారు ఇతరులకు తీర్పు తీరుస్తారు. వారి కంటిలో దూలము పెట్టుకొని ఇతరుల కంటిలోనున్న నలుసును చూస్తారు. చాలా సునాయాసముగా తీర్పు తీరుస్తుంటారు. మీరు తీర్పు తీర్చకుడని ప్రభువు చెపుతున్నాడు.

**"మీరు తీర్పు తీర్చకుడి, అప్పుడు మిమ్మునుగూర్చి తీర్పు తీర్చబడదు. మీరు తీర్చు తీర్పు చొప్పుననే మిమ్మునుగూర్చియు తీర్పు తీర్చబడును, మీరు కొలుచుకొలత చొప్పుననే మీకును కొలువబడును. నీ కంటిలోనున్న దూలము నెంచక నీ సహోదరుని కంటిలోనున్న నలుసును చూచుట యేల? నీ కంటిలో దూలముండగా, నీవు నీ సహోదరుని చూచి - నీ కంటిలో నున్న నలుసును తీసివేయనిమ్మని చెప్ప నేల? వేషధారీ, మొదట నీ కంటిలోనున్న దూలమును తీసివేసికొనుము, అప్పుడు నీ సహోదరుని కంటిలోనున్న నలుసును తీసివేయుటకు నీకు తేటగా కనబడును."**

- మత్తయి 7:1-5

తప్పులెన్నువారు తమ తప్పులెరుగరు. ఇతరులలో తప్పు చూపించేముందు మనలో ఏదైనా తప్పుందా? అని స్వపరీక్ష చేసికోవాలి. మన తలంపులు, స్వభావము, జీవిత విధానములు దైవచిత్తానుసారముగా ఉన్నాయో లేదో పరీక్షించుకోవాలి. నీ కంటిలో దూలము పెట్టుకొని నీ సహోదరుని కంటిలో నలుసుందని తీర్పు తీర్చవద్దు. దైవభయము కలిగి యుండాలి. కొందరు ఇతరులను వ్రేలుపెట్టి చూపి తిరస్కరిస్తారు. ఇట్టి కార్యములు విశ్వాసులకు తగవు గనుక మానుకోవాలి.

**"అప్పుడు నీవు పిలువగా యెహోవా ఉత్తరమిచ్చును. నీవు మొఱ్ఱపెట్టగా ఆయన - నేనున్నాననును. ఇతరులను బాధించుటయు వ్రేలుపెట్టి చూపి తిరస్కరించుటయు చెడ్డదానినిబట్టి మాటలాడుటయు నీవు మాని ఆశించినదానిని ఆకలిగొనినవానికిచ్చి శ్రమపడినవానిని తృప్తిపరచిన యెడల చీకటిలో నీ వెలుగు ప్రకాశించును."** - యెషయా 58:9,10

నీవు ఇతరులను వ్రేలుపెట్టి చూపి తిరస్కరించడము, చెడుగా మాట్లాడటము మానుకోవాలి. లేనివార్తలు పుట్టించి ఇతరులకు ఇబ్బంది కలిగించకూడదు. ఇతరులు ఏమైనా గొప్ప కార్యములు చేస్తుంటే కొందరు విమర్శిస్తుంటారు. చేతగానివారికే మాటలెక్కువ. అట్టివన్నియు శిక్షార్హములని గ్రహించి మానుకోవాలి. ఇతరులు నీకంటే యోగ్యులని ఎంచాలి. ఎక్కడ అహంకారముంటే అక్కడ అసమాధానము అశాంతి ఉంటాయి. కాబట్టి అహంకారదృష్టి కలిగి గర్వించకుండ యథార్థప్రవర్తన కలిగియున్నప్పుడు దేవుడు నీకు తోడుగా ఉంటాడు. అట్టివారికి చీకటిలోకూడ వెలుగు పుడుతుంది. యేసు ప్రభువు ఎక్కడా అహంకారముగా ప్రవర్తించలేదు. ఆయనలో తగ్గింపు, దీనమనస్సు, వినయము, విధేయత చూడగలము. అలాంటి స్వభావమే విశ్వాసులు కలిగియుండాలి. అహంకారము వెంబడి అవమానము కలుగుతుంది. దేవుడు అహంకారులను ఎదిరించి దీనులకు తన కృపనిస్తాడు. కాబట్టి అహంకారమును విడిచిపెట్టాలి.

**"అహంకారము వెంబడి అవమానము వచ్చును."**- సామెతలు 11:2

**"దేవుడు అహంకారులను ఎదిరించి దీనులకు కృప అనుగ్రహించును."**

- 1 పేతురు 5:5

**"అహంకార దృష్టియు గర్వ హృదయమును భక్తిహీనుల క్షేమమును పాపయుక్తములు."** - సామెతలు 21:4

అహంకారగుణము గలవానికంటే శాంతగుణము గలవాడు శ్రేష్ఠుడు గనుక అహంకారమును తొలగించుకొని శాంతగుణము కలిగియుండాలి. సాధువైనట్టి మృదువైనట్టియునైన గుణము కలిగియుండాలి. దేవుని బిడ్డలు జ్ఞానయుక్తముగా వివేచన గలిగి నడుచుకోవాలి. నీ అడుగు ఇరుకున పడకుండ, నీవు శోధనలో పడిపోకుండ, క్రూరమైన కార్యములు చేయకుండ దేవుని వాక్యపు వెలుగులో నడవాలి. అనుదిన జీవితములో మన ప్రభువైన యేసుక్రీస్తును మాదిరిగా పెట్టుకొని ఆయనను పోలి జీవించాలి.

**"పడిపోవుటకు ముందు అహంకారమైన మనస్సు నడచును."**

- సామెతలు 16:18

అహంకారము నీలో ప్రవేశిస్తే నీ పతనము ఆరంభము అయినట్టే అని వాక్యము హెచ్చరిస్తుంది. నాశనమునకు ముందు గర్వము, అహంకారము వెంబడి అవమానము, పడిపోవుటకు ముందు అహంకారముగల మనస్సు నడుస్తుంది.

**"- అహంకారులై యుండకుడని అహంకారులకు నేను ఆజ్ఞ ఇచ్చుచున్నాను. కొమ్ము ఎత్తకుడి, ఎత్తుగా కొమ్ము ఎత్తకుడి, పొగరుపట్టిన మాటలాడకుడి అని భక్తిహీనులకు నేను ఆజ్ఞ ఇచ్చుచున్నాను."**

- కీర్తనలు 75:4,5

అహంకారులై యుండవద్దని, పొగరుపట్టిన మాటలు మాట్లాడవద్దని దేవుడు ఆజ్ఞాపిస్తున్నాడు. నీవు అహంకారముతో గర్విస్తే దేవుడు నీ కొమ్ములు విరిచేస్తాడు జాగ్రత్త! యెహోవాయందు భయభక్తులుగలవారు చెడుతనమును అసహ్యించుకుంటారు.


**"యెహోవాయందు భయభక్తులు గలిగియుండుట చెడుతనము నసహ్యించు కొనుటయే. గర్వము అహంకారము దుర్మార్గత కుటిలమైన మాటలు నాకు అసహ్యములు."** - సామెతలు 8:13

దేవుడు అసహ్యించుకొనే గర్వము, అహంకారము, దుర్మార్గత, కుటిలమైన మాటలు తొలగించుకోవాలి. సాత్వికమైన నాలుక జీవవృక్షము.

**"తమ పొరుగువారిని చాటున దూషించువారిని నేను సంహరించెదను. అహంకార దృష్టిగలవారిని గర్వించిన హృదయము గలవారిని నేను సహింపను."** - కీర్తనలు 101:5

అహంకార దృష్టిగలవారిని దేవుడు సహింపనంటున్నాడు. అహంకారులకు ధైర్యము లేక వెనుక మాట్లాడుతారు. ఇతరులమీద కొండెములు చెపుతు పొరుగువారిని చాటున దూషిస్తూ దేవునికి విరోధముగా మాట్లాడేవారిని దేవుడు సంహరిస్తాడని వాక్యము బోధిస్తుంది. అహంకారులు ఇతరులకు గొయ్యి త్రవ్వాలని ప్రయత్నిస్తారు గాని వారే ఆ గోతిలో పడిపోతారు. హామాను - మొర్దెకై తనకు నమస్కరించలేదన్న అహంకారముతో మొర్దెకైను చంపాలని ఉరికొయ్యను సిద్ధపరచాడు గాని తానే ఉరితీయబడ్డాడు. దేవుడు నీతిన్యాయములుగలవాడు. ఆయన చేతిలో త్రాసుగలవాడు. ఎవరిని శిక్షించాలో, ఎవరిని పైకి లేవనెత్తాలో ఆయనకు బాగుగా తెలుసు. కాబట్టి అహంకారముగల మనస్సును గర్వహృదయమును నీలోనుండి తొలగించుకోవాలి. పొగరుపట్టిన మాటలు మాట్లాడకుండ జాగ్రత్తగా ఉండాలి. ఇతరులను విమర్శించడము, కీడు చేయడము, వ్రేలుపెట్టి చూపి తిరస్కరించడము, చాటున దూషించడము వంటివి మానుకోవాలి. యెహోవా యందు భయభక్తులు కలిగి చెడుతనమును విడిచిపెట్టాలి.

**ప్రార్థన:** ప్రభువా, అహంకారదృష్టి నీకసహ్యమని, అహంకారులను నీవు ద్వేషిస్తావని నేర్చుకొన్నాము. మాలోనుండి అహంకారమును తొలగించి నీ రక్తములో కడిగి పవిత్రపరచుమని యేసు నామములో అడుగుతున్నాము తండ్రీ. ఆమేన్!



**జాయ్ చెరియన్**

# దేవుని సహస్రనామములు

## 360. అభ్యంతరము కలిగించు బండ

– యెషయా 8:14

**"సైన్యములకధిపతియగు యెహోవాయే పరిశుద్ధుడనుకొనుడి. మీరు భయపడవలసిన వాడు ఆయనే, ఆయన కోసరమే దిగులుపడవలెను. అప్పుడాయన మీకు పరిశుద్ధస్థలముగా నుండును. అయితే ఆయన ఇశ్రాయేలుయొక్క రెండు కుటుంబములకు తగులు రాయిగాను అభ్యంతరము కలిగించు బండగాను ఉండును. యెరూషలేము నివాసులకు బోనుగాను చిక్కువలగాను ఉండును. అనేకులు వాటికి తగిలి తొట్రిల్లుచు పడి కాళ్లు చేతులు విరిగి చిక్కుబడి పట్టబడుదురు."** – యెషయా 8:13-15

దైవభయము లేనివారికి, అవిధేయులకు ఆయన అభ్యంతరము కలిగించు బండగా, తగులు రాయిగా, బోనుగా, చిక్కువలగా మారిపోతానని అంటున్నాడు. తగులు రాయి నిన్ను తొట్రిల్లచేస్తుంది. అభ్యంతరము కలిగించు బండ అంటే నీవు వర్ధిల్లకుండ నీ మార్గములలో అభ్యంతరము కలుగజేస్తాడని అర్థము. ఆయన అభ్యంతరము కలిగించు బండగా అయిపోతే ఇక నీవేమాత్రము ముందుకుసాగలేవు. ప్రయత్నములు చేస్తావు, ప్రయాసపడతావు కాని ఫలితమేమి కనపడదు. ఎందుకంటే దేవుడు నీ ప్రయత్నములలో అభ్యంతరము కలిగించు బండగా అయిపోతాడు. రాత్రి పగలు కష్టపడి వ్యాపారము చేసి లక్షలు కూడబెడతావు. కాని దానిని అనుభవించడానికి నీకు దేవుడు అనుమతినివ్వడు. నీకు ఏ హృద్రోగమో వస్తుంది. కూడబెట్టినదంతా హాస్పిటల్ పాలవుతుంది. ఎందుకంటే నీకు దైవభయము లేదు. స్వశక్తి మీదనే ఆధారపడుతున్నావు. దేవుని ఆజ్ఞలు త్రోసివేస్తున్నావు. దేవునికి దశమ భాగము ఇవ్వకుండ కూర్చుకుంటున్నావు. కాని నష్టపోతున్నావు. నీవు కూడబెట్టినది ఇతరుల పాలవుతుంది.

దైవశక్తికంటే స్వశక్తినే నమ్ముకొని వ్యాపారము ప్రారంభిస్తావు. కాని నీ మార్గములో, నీవు చేయు పనులలో నీవు వర్ధిల్లడము లేదు. ఎందుకంటే ఆయన మాట వినకుంటే ఆయన నీ మార్గములో నీకు అభ్యంతరము కలిగించు బండగా అయిపోతాడు. జాగ్రత్త! నీ పాదములు క్రీస్తనే బండ మీద లేవు. దేవుడనుగ్రహించిన రక్షణను నిర్లక్ష్యము చేస్తున్నావు. దేవుని తృణీకరిస్తున్నావు. నీ సొంతజ్ఞానముపై ఆధారపడుతున్నావు. భక్తిహీనుడిగా మారిపోతున్నావు. దైవస్వరముకంటే మానవుల స్వరమునకు లోబడు తున్నావు. స్వకీయమైన దురాశలకు ఈడ్వబడుతున్నావు. శకునగాండ్రను, సోదె చెప్పువారిని, కర్ణపిశాచిగలవారియొద్దకు, కిచకిచలాడుతు గొణుగు మంత్రజ్ఞుల దగ్గర విచారిస్తున్నావు. వారు ధరించమనే రంగురాళ్లను, తాయిత్తులను ధరిస్తున్నావు. నీవు క్రీస్తుకు భయపడకుండ వాస్తుకు భయపడుతున్నావు. మనము భయపడవలసినవాడు ఆయనే. నీవు విశ్వాసివి. ఆయన తన ప్రశస్త రక్తమును వెలగా చెల్లించి మనలను సంపాదించుకొన్నాడు. నీవు భయపడవలసింది ఆయనకే. నీవు దేవునికి భయపడకుండ అనవసరమైన వాటికి భయపడుతుంటే నీకు రక్షణ బండగా ఉండవలసిన దేవుడు నీకు అభ్యంతరము కలిగించు బండగా మారిపోతాడు. భక్తిహీనుల ఆలోచనలు సాగనివ్వకుండ వారికి అభ్యంతరము కలిగించు బండగా అయిపోతాడు. చాలా మంది దేవునిసేవకు అభ్యంతరము కలిగించాలని ప్రయత్నిస్తుంటారు. దయచేసి అలాంటి కలలు కనకండి. దేవుని సేవకురాలిగా ఆత్మాభిషేకముతో చెబుతున్నాను. దేవుని సేవకు, సేవకులకు ఆటంకముగా నిలబడి ఇంతవరకు ఎవరూ వర్ధిల్లలేదు. అట్టివారికి నాశనమే. సిలువకు శత్రువులుగా ఉండేవారు తప్పకుండ నశిస్తారు. అభ్యంతరములు రాక మానవు కాని ఆ అభ్యంతరము ఎవరి వలన కలుగుతుందో వారికి శ్రమ అని యేసుప్రభువు స్వయముగా బోధించాడు. దేవుని సేవకు నీవు అభ్యంతరము కలుగజేస్తే ఆయన నీకు మహా అభ్యంతరముగా మారిపోతాడు.

**"అభ్యంతరములవలన లోకమునకు శ్రమ; అభ్యంతరములు రాకతప్పవు గాని, యెవనివలన అభ్యంతరము వచ్చునో ఆ మనుష్యునికి శ్రమ."**

– మత్తయి 18:7

ఇస్కరియోతు యూదా యేసు ప్రభువు శిష్యుడిగా ఉన్నాడు. ఆయనతో కలసి తిరిగాడు కాని ప్రభువునే మోసపుచ్చాడు. కపట భక్తితో ఆయనను అనుసరించాడు. దేవునికే ఆటంకముగా ఉండాలని, రక్షణ కార్యములనే విఫలము చేయాలని అనుకున్నాడు. అభ్యంతరముగా ఉండాలనుకున్నాడు కాని ఓడిపోయాడు. వాని అవసానము ఎంత ఘోరముగా ఉందో చూడండి.

**"ఈ యూదా ద్రోహమువలన సంపాదించిన రూకల నిచ్చి యొక పొలము కొనెను. అతడు తలక్రిందుగాపడి నడిమికి బద్దలైనందున అతని పేగులన్నియు బయటికి వచ్చెను."** – అపొ.కార్య. 1:18

యూదా భక్తిహీనతను ఉరితాడుకూడా భరించలేక తెగిపోయింది. అతడు తలక్రిందులుగాపడి నడిమికి బద్దలైనందున అతని పేగులన్నియు బయటకు వచ్చాయి. భయంకరమైన చావు చచ్చాడు. ఈ నామము ధ్యానించినప్పుడు మనలో దైవభయము రావాలి. వాక్యము వింటున్న కొలది చదువుతున్న కొలది మన హృదయాలు మారిపోవాలి. దేవునికి విధేయులమవుతు ఆయన కట్టడలను అనుసరిస్తు దేవుని వాక్యప్రకారము నడుచుకోవాలి. దేవుడు కృపాక్షమాపణ గలవాడని చెప్పి, ఏ తప్పు చేసినా చెల్లిపోతుందని అనుకోకు. ఆయన ఎంతగా క్షమిస్తాడో అంతగా శిక్షిస్తాడు. ఎంతగా కృపాక్షమాపణలు, కనికరము చూపుతాడో నీవు మాటి మాటికి తప్పులు చేస్తూ నీ ప్రవర్తన మార్చుకోకుంటే నీ పట్ల ఉగ్రత కనుపరుస్తాడు. అందుకే పౌలు భక్తుడంటాడు – జీవముగల దేవుని చేతిలో పడుట బహు భయంకరమని. నీవు ఒకసారి వెలిగింపబడి మారుమనస్సు పొందిన తరువాత తప్పిపోతే అట్టివారిని మరల నూతన పరచడము అసాధ్యమని అంటున్నాడు.

**"ఒకసారి వెలింగిపబడి, పరలోకసంబంధమైన వరమును రుచిచూచి, పరిశుద్ధాత్మలో పాలివారై దేవుని దివ్యవాక్యమును రాబోవు యుగ సంబంధమైన శక్తుల ప్రభావమును అనుభవించిన తరువాత తప్పిపోయినవారు, తమ విషయములో దేవుని కుమారుని మరల సిలువవేయుచు, బాహాటముగా ఆయనను అవమానపరచుచున్నారు గనుక మారుమనస్సు పొందునట్లు అట్టి వారిని మరల నూతనపరచుట అసాధ్యము. ఎట్లనగా, భూమి తనమీద తరుచుగా కురియు వర్షమును త్రాగి, యెవరికొరకు వ్యవసాయము చేయబడునో వారికి అనుకూలమైన పైరులను ఫలించుచు దేవుని ఆశీర్వచనము పొందును. అయితే ముండ్ల తుప్పలును గచ్చ తీగెలును దానిమీద పెరిగినయెడల అది పనికిరానిదని**

**విసర్జింపబడి శాపము పొందతగినదగును. తుదకది కాల్చి వేయబడును."**

– హెబ్రీ. 6:4-8

కావున దేవుడు అభ్యంతరము కలిగించు బండగా మారక ముందే దేవునికి విధేయులమై ఆయన చిత్తానుసారముగా నడుచుకుందాము. దేవుని ఆజ్ఞలు లక్ష్యపెట్టకుండ నేను బలాఢ్యుడిని, అన్ని రీతులుగా బాగానే ఉన్నాను అనుకుంటున్నావా? విచారణ లేకుండానే ఆయన బలవంతులను నిర్మూలము చేస్తానంటున్నాడు. జ్ఞానినని అనుకుంటున్నావా? జ్ఞానులను వారి కృత్రిమములోనే పట్టుకుంటాడు. కపటుల ఆలోచనలు తలక్రిందులు చేస్తాడు.

**"వంచకులు తమ పన్నాగములను నెరవేర్చనేరకుండ ఆయన వారి ఉపాయములను భంగపరచును. జ్ఞానులను వారి కృత్రిమములోనే ఆయన పట్టుకొనును. కపటుల ఆలోచనను తలక్రిందుచేయును. పగటివేళ వారికి అంధకారము తారసిల్లును. రాత్రి ఒకడు తడవులాడునట్లు మధ్యాహ్న కాలమున వారు తడవులాడుదురు."** – యోబు 5:12-14

**"విచారణ లేకుండనే బలవంతులను ఆయన నిర్మూలము చేయుచున్నాడు వారి స్థానమున ఇతరులను నియమించుచున్నాడు. వారి క్రియలను ఆయన తెలిసికొనుచున్నాడు రాత్రియందు ఆయన నాశనము కలుగజేయగా వారు నలుగగొట్టబడుదురు. దుష్టులని బహిరంగముగానే ఆయన వారిని శిక్షించును. ఏలయనగా వారు ఆయనను అనుసరించుట మానిరి ఆయన ఆజ్ఞలలో దేనినైనను లక్ష్యపెట్టకపోయిరి."** – యోబు 34:24-27

ఆయన నీకు అభ్యంతరము కలిగించు బండగా మారిపోకుండా వినయ విధేయతలతో, భక్తి శ్రద్ధలతో దైవభయము కలిగి ఆయన అనుగ్రహించిన రక్షణను కొనసాగించాలి. నీవు ఆయనకు విధేయుడవై ఆయన మాట వింటే నీకు రక్షణ బండగా మారి నీ ఆత్మీయ జీవితమును చక్కగా కడతాడు. నీకు మూలరాయిగా, అమూల్యమైన రాయిగా ఆయన ఉంటాడు. కాని నీవు అవిధేయుడవైతే నిన్ను నలగగొట్టడానికి, పడద్రోయడానికి, తూలి తొట్రిల్లిపడి కాళ్లు చేతులు విరుగగొట్టడానికి తగులు రాయిగా; నీవు వర్ధిల్లకుండ నీ మార్గములో అభ్యంతరము కలిగించు బండగా ఉంటాడు. కాబట్టి దైవభయముతో మన జీవితములు దేవుని వాక్యపు వెలుగులో సరిచేసికోవాలి.

## 361. బోను

– యెషయా 8:14

**"అయితే ఆయన ఇశ్రాయేలుయొక్క రెండు కుటుంబములకు తగులు రాయిగాను అభ్యంతరము కలిగించు బండగాను ఉండును. యెరూషలేము నివాసులకు బోనుగాను చిక్కువలగాను ఉండును. అనేకులు వాటికి తగిలి తొట్రిల్లుచు పడి కాళ్లు చేతులు విరిగి చిక్కుబడి పట్టబడుదురు."**

– యెషయా 8:14,15

**'బోను'**ను అందరు చూసే ఉంటారు. చిన్నబోను ఎలుకలను పట్టడానికి ఉపయోగిస్తారు. పెద్దబోనును సింహము, పులి, ఎలుగుబంటి వంటి క్రూర జంతువులను పట్టడానికి ఉపయోగిస్తారు. ఇక్కడ దేవుని నామము **'బోను'** అని ధ్యానిస్తున్నాము. ఇది జంతువులను పట్టే బోను వంటిది కాదు. అవిధేయులైనవారికి దేవుడే బోనుగా మారిపోతాడని వాక్యము బోధిస్తుంది. ఈ బోనులో పడితే నీవింక తప్పించుకొని బయటకు రాగలవా?

ఆయన రక్షకుడు, ప్రజలను వారి పాపములనుండి విమోచించినవాడు, సాతాను బంధకములనుండి విడిపించినవాడు, నీ కట్లను బంధకములను త్రెంపివేసి నిన్ను స్వతంత్రునిగా చేసిన దేవుడే, నీవు పాపము చేసి దేవునికవిధేయుడవైనప్పుడు నిన్ను చిక్కించుకునే బోనుగా మారిపోతాడు. రక్షణమార్గము నీకొరకు సిద్ధపరచినవాడే నీవు తప్పించుకునే మార్గమును మూసివేయగలడు. కొందరు మాటి మాటికి దేవుని వాక్యము వింటూ, చదువుతూ ఏమాత్రము తమ ప్రవర్తన మార్చుకోకుండా వాతవేయబడిన మనస్సాక్షి కలిగి దేవునికి అవిధేయులవుతు, వారు దైవచిత్తాన్ని నిర్లక్ష్యము చేస్తు సొంతచిత్తమును నెరవేర్చుకుంటు ఉంటారు. ఇలాంటి వారికి రక్షించవలసిన దేవుడు శిక్షకుడిగా మారిపోతాడు. బోనుగా మారి నిన్ను పట్టుకుంటాడు.

యోనా భక్తునికి ఇది సంభవించింది. దేవుడు నీనెవె పట్టణమునకు వెళ్లమని ఆజ్ఞాపిస్తే, దైవాజ్ఞను నిర్లక్ష్యము చేసి సొంత చిత్తముతో తర్షీషుకు వెళుతున్నాడు. కాని అవిధేయులకు బోను సిద్ధముగా ఉంటుంది. యోనా అవిధేయతనుబట్టి దేవుడు సముద్రములో తుపాను కలుగజేయగా యోనా ప్రయాణిస్తున్న ఓడ బ్రద్దలయ్యే పరిస్థితి ఏర్పడుతుంది. అప్పుడు ఓడలో ప్రయాణిస్తున్నవారు, నావికుడు ఎవనివలన ఈ పరిస్థితి సంభవించెనో తెలుసుకోవడానికి చీట్లు వేస్తారు. అప్పుడు చీట్లలో యోనా పేరు వస్తుంది. అప్పుడు యోనా నేను దేవునికవిధేయుడనై తప్పించుకొని పోవాలని ప్రయత్నించాను. నన్ను బట్టియే యీ గొప్ప తుపాను మీ మీదకు వచ్చింది. నన్ను ఎత్తి సముద్రములో పడవేయండి. అప్పుడు సముద్రము మీ మీదకు రాకుండ నిమ్మళిస్తుందని చెబుతాడు. వారు యెహోవాకు ప్రార్థన చేసి యోనాను సముద్రములో పడవేస్తారు. యెహోవా ఆజ్ఞమేరకు మత్స్యము యోనా భక్తుని మ్రింగివేస్తుంది. మత్స్యము కడుపు యోనాకు బోనుగా మారిపోయింది. ఓడనుండి త్రోయబడినప్పుడు యోనా ఎక్కడో సముద్రాంతర్భాగములో కొట్టుకొని పోయి నశించవచ్చు. కాని దేవుని ప్రేమ చూడండి. ఆయన నిన్ను విడువడు ఎడబాయడు. నీకొరకు తన ప్రాణమే పెట్టాడు. దేవుడు తాను ప్రేమించువారిని గద్దించి శిక్షించి సరిచేస్తాడు. యోనా తన అవిధేయతకు శిక్షపొందుతూ మత్స్యము కడుపులో నుండి ప్రార్థిస్తున్నాడు.

**"ఆ మత్స్యము కడుపులోనుండి యోనా యెహోవాను ఈలాగున ప్రార్థించెను. నేను ఉపద్రవములో ఉండి యెహోవాకు మనవిచేయగా ఆయన నాకు ప్రత్యుత్తరమిచ్చెను; పాతాళగర్భములోనుండి నేను కేకలు వేయగా నీవు నా ప్రార్థన నంగీకరించియున్నావు. నీవు నన్ను అగాధమైన సముద్రగర్భములో పడవేసియున్నావు, ప్రవాహములు నన్ను చుట్టుకొని యున్నవి, నీ తరంగములును నీ కరుళ్లును నన్ను కప్పియున్నవి. నీ సన్నిధిలోనుండి నేను వెలివేయబడినను, నీ పరిశుద్ధాలయముతట్టు మరల చూచెదననుకొంటిని. ప్రాణాంతము వచ్చునంతగా జలములు నన్ను చుట్టుకొనియున్నవి, సముద్రాగాధము నన్ను ఆవరించియున్నది, సముద్రపు నాచు నా తలకుచుట్టుకొనియున్నది. నేను మరెన్నటికిని ఎక్కిరాకుండ భూమి గడియలు వేయబడియున్నవి; పర్వతముల పునాదులలోనికి నేను దిగియున్నాను, నా దేవా, యెహోవా, నీవు నా ప్రాణము కూపములోనుండి పైకి రప్పించియున్నావు. కూపములోనుండి నా ప్రాణము నాలో మూర్ఛిల్లగా నేను యెహోవాను జ్ఞాపకము చేసికొంటిని; నీ పరిశుద్ధాలయములోనికి నీయొద్దకు నా మనవి వచ్చెను. అసత్యమైన వ్యర్థదేవతలయందు లక్ష్యముంచువారు తమ కృపాధారమును విసర్జింతురు. కృతజ్ఞతాస్తుతులు చెల్లించి నేను నీకు బలుల నర్పింతును, నేను మ్రొక్కుకొనిన మ్రొక్కుబళ్లను చెల్లింపక మానను. యెహోవాయొద్దనే రక్షణ దొరుకును అని ప్రార్థించెను.**

**అంతలో యెహోవా మత్స్యమునకు ఆజ్ఞ ఇయ్యగా అది యోనాను నేలమీద కక్కివేసెను."** - యోనా 2:1-10

యోనా భక్తుడు తన అనుభవముద్వారా ఈ మాటలు పలుకుతున్నాడు. జీవముగల సత్యదేవుని త్యజించి, ఆయన మాటలు ఉల్లంఘించి సొంత చిత్తమునకు వెళ్లిపోయాడు. అసత్యమైన వ్యర్థదేవతలు అంటున్నాడు. వ్యర్థదేవతలు అంటే కేవలము చెక్కుడు ప్రతిమలే కాదు. దేవునికంటే ఎక్కువగా నీవు దేనిని ప్రేమిస్తే అది నీకు విగ్రహముగా మారిపోతుంది. నీవు దైవచిత్తముకంటే నీ సొంత చిత్తమును ప్రేమిస్తే అది నీకు విగ్రహముగా మారిపోతుంది. దేవుడు దానిని సహించలేడు. తప్పకుండ దేవుని శిక్ష నీ మీదకు వస్తుంది. నీకొరకు ప్రాణము పెట్టిన ప్రభువు మాటలు వినకుండ విగ్రహముల తట్టు ఎందుకు తిరగాలి? దేవుని ఆలయములో దేవుని కార్యములు జరగడము చూస్తున్నారు. దేవుడు తానభిషేకించిన తన సేవకుల ద్వారా వాక్యము బయలు పరుస్తున్నాడు. దేవుని నామముద్వారా దేవుని గుణాతిశయములు తెలిసికుంటున్నారు. ఆయనకు అవిధేయత చూపుతు కొందరు తమ సొంత త్రోవలకు తిరుగుతున్నారు. గొఱ్ఱెలవలె దారి తప్పుతున్నారు. వాక్యము మీయొద్దకు వచ్చినప్పుడు మీ ప్రవర్తన సరిచేసికోవాలి. ఆయన వాక్యము వెల్లడి అయినప్పుడు చీకటిలో వెలుగు కలుగుతుంది. అందుకే కీర్తనకారుడు నీ వాక్యము నా పాదములకు దీపము అది నా త్రోవకు వెలుగైయుంది అంటున్నారు. అవిధేయులకు ఆయన తగులు రాయిగా, అభ్యంతరము కలిగించు బండగా, బోనుగా, చిక్కువలగా మారిపోతాడని దేవుని వాక్యము బోధిస్తుంది. కనుక దైవభయముతో ప్రార్థించండి. అవిధేయులకు నీవు ఏ విధముగా మారిపోతావో నేను వాక్యము ద్వారా నేర్చుకున్నాను. దయతో నన్ను క్షమించు. నన్ను నీకు విధేయుడిగా మార్చు. ప్రతి ఉదయమున నేను నీ స్వరమే వినాలి. నీ స్వరమునకే నేను లోబడాలి. నీ సన్నిధి కాంతితో నన్ను నింపుమని ప్రార్థించాలి. అప్పుడు దేవుని కనికరము పొందుతావు.

బేతెహేలేమంటే రొట్టెల ఇల్లు. యెరూషలేమంటే స్తుతుల గృహము. యెరూషలేములో ఉండేవారికి ఏ కొదువ లేదు. ఇంత అద్భుతమైన ఆశీర్వాదములతో నింపబడిన యెరూషలేముకు శ్రమ సంభవిస్తుందా? సంభవిస్తుంది. ఎప్పుడైతే యెరూషలేము నివాసులు దేవునికవిధేయులుగా మారిపోయి దేవుని మార్గములోనుండి ప్రక్కకు తొలగిపోతారో అప్పుడు దేవుడు వారికి బోనుగా, చిక్కువలగా మారిపోతాడు. కనుక వాక్యము చదువుతున్న నీలో అవిధేయత ఉంటే నిన్ను నీవు సరిచేసికొని ప్రభువా, నన్ను క్షమించు, నీ వాక్యము ఒక చెవితోవింటూ మరియొక చెవితో వదిలి వేస్తున్నాను. నీ ఆజ్ఞలు, నియమాలు ఉల్లంఘించి సొంత చిత్తమునకు, మనుష్యుల కపటోపాయములకు తల వంచుతున్నాను. నాకొరకు ప్రాణము పెట్టిన నిన్ను విశ్వసించకుండ వ్యర్థమైనవాటిని ఆశ్రయిస్తున్నాను. వాటియందు నమ్మకముంచుతున్నాను. నేను భయపడవలసినవాడవు నీవే. కాని నిన్ను విసర్జించి పనికిరాని వ్యర్థమైనవాటియందు లక్ష్యముంచు తున్నాను. వాటికి భయపడుతున్నాను. క్రీస్తును వదిలి వాస్తును నమ్ముతున్నాను. మూలరాయి అయిన నిన్ను త్యజించి రంగు రాళ్లను ఆశ్రయిస్తున్నాను. నా తప్పు తెలిసికోకుంటే నాకు తగులురాయిగా అభ్యంతరము కలిగించు బండగా అయిపోతావు. బోనుగా, చిక్కువలగా మారిపోతావనే సత్యము నీ వాక్యముద్వారా తెలిసికున్నాను. దయతో నన్నుక్షమించుమని ప్రార్థించు. తీర్పు దినమున నీవు మంచి మనస్సాక్షితో ప్రభువు సన్నిధిలో కనిపించాలి. ఆయన అహంకారులను ఎదిరించి దీనులకు కృప అనుగ్రహిస్తాడు. నీవు దేవునికి భయపడితే మరి దేనికీ భయపడవు.

ఒక ఉన్నతాధికారినో, ఒక మంత్రినో కలిసికోవాలంటే ఎన్ని ప్రయత్నములు చేసినను కొన్ని సార్లు విఫలమవుతుంది. వారినుండి మనకెటువంటి సహాయము లభించదు. కాని మన ప్రభువు నీవు పిలిస్తే పలుకుతాడు. నీవు పిలవడమే ఆలస్యము, ఇదిగో నేనున్నానని అంటాడు. మనము కనికరింపబడి సమయోచితమైన సహాయము పొందునట్లు ధైర్యముతో కృపాసనము సమీపించాలి. లోబడనొల్లని ప్రజలకొరకు ఆయన చేతులు చాపబడియున్నవి. ఎప్పుడైతే నీవు నీ తప్పు తెలిసికొని పశ్చాత్తాప హృదయముతో ఆయన సన్నిధికి వస్తావో ఆయన నీ అవకతవకలన్ని సరిచేస్తాడు. ఈ కృపాసింహాసనము తీర్పు సింహాసనము కాక ముందే నిన్ను నీవు సరిచేసికొని మారుమనస్సు పొందు. లేకుంటే ఆయన నీకు బోనుగా చిక్కువలగా మారిపోతాడు జాగ్రత్త!

## 362. చిక్కువల

- యెషయా 8:14

**"యెరూషలేము నివాసులకు బోనుగాను చిక్కువలగాను ఉండును."**
- యెషయా 8:14

**'చిక్కువల'** అంటే నిన్ను చిక్కించుకొనే వల, ఉచ్చు అని అర్థము. ఎవరినైనా పట్టుకోవాలంటే, లేదా ఏదైన క్రూరజంతువును అదుపులోకి తీసికొని చిక్కించుకోవాలంటే వల వేస్తారు. మొండి ఎద్దు లోబడకుంటే దాని ముక్కుకు గాలము వేయడానికి, దానిని చిక్కించుకోవడానికి వల వేస్తారు. అలాగే అవిధేయులును, దేవుడు లేడనేవారిని, దైవచిత్తమును నిర్లక్ష్యము చేస్తు యిష్టానుసారముగా నడుచుకుంటు సొంత చిత్తము నెరవేర్చుకుంటు గర్వించేవారిని ఆయన వలవేసి పట్టుకుంటాడు. ఆయన నీకు చిక్కువలగా మారిపోతాడు. ఆయన ఒక్క దెబ్బతో నిన్ను పడవేస్తాడు. నా సొంత తెలివితో నా స్వశక్తితో పైకి వచ్చానని మిడిసిపడితే దేవుడు నీకు తగులు రాయిగా, అభ్యంతరము కలిగించు బండగా నీ మార్గములో అడ్డుకుంటాడు. ఆయన నీకు బోనుగా, చిక్కువలగా మారిపోతాడు. అందుకే నరులు ఎల్లప్పుడు దైవభయము కలిగి ఆయన కృపకొరకు కనిపెట్టాలి. గర్వము అహంకారము ఉంటే తొలగించుకోవాలి. ఎల్లప్పుడు వినయమనస్కుడవై నాయనా, తండ్రీ నేనేమైయున్నానో అది కేవలము నీ మహా కృపవలననే అని దేవుని స్తుతించాలి. ఈ లోకములో నీవు అతిశయించడానికి ఏమీలేదు. జ్ఞాని తన జ్ఞానమునుబట్టిగాని, శూరుడు తన శౌర్యమందు కాని, బలాఢ్యుడు తన బలమందు గాని, ధనవంతుడు తన ధనమందుగాని అతిశయించడానికి వీలు లేదు. నీవు భూమిమీద కృపచూపుచున్న నీ దేవుడైన యెహోవానుబట్టియే అతిశయించాలి.

**"యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు – జ్ఞాని తన జ్ఞానమునుబట్టియు, శూరుడు తన శౌర్యమునుబట్టియు అతిశయింపకూడదు, ఐశ్వర్యవంతుడు తన ఐశ్వర్యమునుబట్టి అతిశయింపకూడదు. అతిశయించువాడు దేనినిబట్టి అతిశయింపవలెననగా, భూమిమీద కృపచూపుచు నీతి న్యాయములు జరిగించుచున్న యెహోవాను నేనేయని గ్రహించి నన్ను పరిశీలనగా తెలిసికొనుటనుబట్టియే అతిశయింపవలెను; అట్టి వాటిలో నేనానందించు వాడనని యెహోవా సెలవిచ్చుచున్నాడు."** - యిర్మీయా 9:23,24

నీవు దేవునిబట్టి అతిశయింపకుండ నిన్నుబట్టి నీవు అతిశయిస్తే నీవేవి సంపాదించుకున్నావో అవే నీకు ఉరిగా మారిపోతాయి. అదే నీకు చిక్కువలగా అవుతుంది. దానినుండి తప్పించుకొని బయటకు రాలేవు.

ఒక బందిపోటు దొంగ ఒక గృహమును దోచుకొని ఆ ఇంట్లో ఉన్న నగలు, డబ్బు అన్ని మూటగట్టుకొని తప్పించుకొని పారిపోతున్నాడు. దొంగ వెళ్లగానే ఇంట్లోవారు పోలీసులకు ఫోన్ చేశారు. దొంగ పరుగెత్తుతు రోడ్డుమీద వెళుతున్న ఒక ఆటోరిక్షాను ఆపి అందులో ఎక్కి కూర్చున్నాడు. కాని అందులో అతనిని పట్టుకోవడానికి వచ్చిన ఇద్దరు పోలీసులు ఉన్నారు. చీకటిలో చూడకుండ ఎక్కేశాడు. ఎవరినుండి తప్పించుకోవాలనుకున్నాడో వారి చేతికే చిక్కాడు. దేవుని సన్నిధిలోనుండి తప్పించుకుందామని నీవనుకుంటున్నావా? నాకేమి ఫరవాలేదు. నన్నెవరు ఏమీ చేయలేరు, నేనేమనుకున్నావు? నా కాన్‌దాన్ (ఫ్యామిలీ) ఏమనుకున్నావు? నా తాత ముత్తాతలు ఎవరనుకున్నావు అని నిన్నుబట్టి గర్విస్తున్నావా? దేవుడు నిన్ను చిక్కించుకోవడానికి వలవేస్తే అందులో నుండి తప్పించడము ఎవరికీ సాధ్యము కాదు.

**"వెనుకను ముందును నీవు నన్ను ఆవరించియున్నావు. నీ చేయి నామీద ఉంచియున్నావు. ఇట్టి తెలివి నాకు మించినది. అది అగోచరము అది నాకందదు. నీ ఆత్మయొద్దనుండి నేనెక్కడికి పోవుదును? నీ సన్నిధినుండి నేనెక్కడికి పారిపోవుదును? నేను ఆకాశమునకెక్కినను నీవు అక్కడను ఉన్నావు. నేను పాతాళమందు పండుకొనినను నీవు అక్కడను ఉన్నావు. నేను వేకువ రెక్కలు కట్టుకొని సముద్ర దిగంతములలో నివసించినను అక్కడను నీ చేయి నన్ను నడిపించును. నీ కుడిచేయి నన్ను పట్టుకొనును. - అంధకారము నన్ను మరుగుచేయును. నాకు కలుగు వెలుగు రాత్రివలె ఉండును అని నేననుకొనిన యెడల చీకటియైనను నీకు చీకటి కాకపోవును. రాత్రి పగటివలె నీకు వెలుగుగా ఉండును. చీకటియు వెలుగును నీకు ఏకరీతిగా ఉన్నవి."** - కీర్తనలు 139:5-12

ఈ మాటలు కీర్తనకారుడు వ్రాస్తున్నాడు. దేవా, నీ సన్నిధిలోనుండి నేనెక్కడికి వెళ్లినను అక్కడ ఉన్నావు. నా చర్యలు, తలంపులు, నడక, పడక అన్నీ నీకు తెలుసు. ఇట్టి తెలివి నాకు మించినది. అది నాకు అగోచరమని దేవుని స్తుతిస్తున్నాడు.

కొందరు వ్యక్తుల రక్షణార్థము మనము ప్రార్థన చేస్తుంటాము. వారు మారుమనస్సు పొంది దేవుని మార్గములో నడవాలని మనము ఆశిస్తాము. కాని ప్రార్థన చేస్తున్న కొలది శోధనలు ఇంకా అధికమవుతాయి. మన ప్రార్థనలు దేవుడు అసలు వింటున్నాడా? అనే అనుమానము కలుగుతుంది. కాని చిక్కువల, బోను అనే నామములు ధ్యానించిన తరువాత నీ అనుమానములన్నీ చెదిరిపోవాలి. ఆయన నామములు బోను, చిక్కువల. నీవు ఎవరి నిమిత్తము ప్రార్థిస్తున్నావో వారిని పట్టేస్తాడు. ఆయన సన్నిధిలో నుండి దూరముగా పరుగెడుతున్నారా? ఆయన తగులు రాయిగా మారిపోతాడు. దానికి తగిలి తొట్రిల్లిపడి కాళ్లు చేతులు విరుగగొట్టు కుంటారు. ఆయన అభ్యంతరము కలిగించు బండ. ఆయన నీవు ముందుకు సాగకుండ నీ మార్గములో అభ్యంతరములు కలుగజేస్తాడు. దేవుని మాటకు అవిధేయులైన వారి గతి ఈ విధముగా ఉంటుంది. కాబట్టి దైవభయము కలిగి వాక్యానుసారముగా నడుచుకోవాలి. ❀

## సంపూర్ణ రాత్రి ప్రార్థన

**ప్రతినెల చివరి బుధవారము**

**రాత్రి 9 గం॥ల నుండి ఉ॥ 5 గం॥ల వరకు**

**సెంటినరి బాప్టిస్టు చర్చి, సికింద్రాబాద్‌లో జరుగును.**

### యు.పి.ఎఫ్. కార్యక్రమములు

1. **ఆదివార ఉదయకాల ఆరాధన :** ప్రతి ఆదివారము ఉ॥ 6 గం॥ల నుండి ఉ॥ 9 గం॥ల వరకు
   **సండే స్కూల్ :** ప్రతి ఆదివారము ఉ॥ 6 గం॥ల నుండి ఉ॥ 9 గం॥ల వరకు మరియు సా॥ 6 గం॥ల నుండి రా॥ 9 గం॥ల వరకు (Zoom) లో
   **సాయంకాల ఆరాధన :**
   **ఇంగ్లిష్ సర్వీస్:** ప్రతి ఆదివారము సా॥ 4 గం॥ల నుండి సా॥ 6 గం॥ల వరకు (Zoom లో)
   **తెలుగు ఆరాధన:** ప్రతి ఆదివారము సా॥ 6 గం॥ల నుండి రా॥ 9 గం॥ల వరకు
2. **365 రోజులు ఉదయకాల ప్రార్థనలు :** ప్రతిరోజు ఉ॥ 4 గం॥ల నుండి ఉ॥ 7 గం॥ల వరకు
3. **యౌవనస్థులకొరకు ప్రత్యేక ప్రార్థనలు :** సోమవారము నుండి శనివారము వరకు మ॥ 2 గం॥ల నుండి 3 గం॥ల వరకు
4. **తల్లుల సహవాసము, మెన్స్ ఫెలోషిప్ & మండే స్కూలు :** ప్రతి సోమవారము సా॥ 6 గం॥ల నుండి రా॥ 9 గం॥ల వరకు
5. **24 × 7 ఎడతెగని ప్రార్థనలు** (Zoom లో)
6. **యూత్ మీటింగ్ :** ప్రతి శనివారము సా॥ 6 గం॥ల నుండి రా॥ 8:30 ని॥ల వరకు

**Zoom id : 9550504718 | Passcode : 7777**

"యెడతెగక ప్రార్థన చేయుడి." - 1 థెస్స. 5:17

**యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ (UPF)** రాంనగర్, హైదరాబాద్ - 500 020.

నిర్వహించు

# 24 X 7 నిరంతర ప్రార్థన



దైవ దర్శనంతో రెవ.డా. జాయ్ చెరియన్ గారు 2023 ఫిబ్రవరి 1వ తేదీన ప్రారంభించిన ఈ నిరంతర ప్రార్థన 24 గంటలు రాత్రింబగళ్లు ప్రభువు రాకడ పర్యంతము జూమ్‌ద్వారా కొనసాగింపబడును.

మీ ప్రార్థన అవసరతలు తెలియజేసినయెడల ఆ సమయంలో అందుబాటులో ఉన్న కాపరులు, నాయకులు, ప్రార్థనవీరులు మీకొరకు ప్రార్థించెదరు.

**Zoom id : 9550504718 | Passcode : 7777**

అందరికీ ఆహ్వానము

# దేవుని వెయ్యి వాగ్దానములు

## 163. ఆయన చేతికార్యములు సత్యమైనవి న్యాయమైనవి.

– కీర్తనలు 111:7

దేవుడు చేసే కార్యము సత్యమైనవి; న్యాయమైనవి. నీవు దేవునిబిడ్డగా శ్రమపడితే – నీకు ఏ అన్యాయము జరుగలేదని నీవు అనుకోవాలి. నీ ప్రార్థనలకు జవాబు రాలేదని, రాదని లోకము అంటుందేమో గాని దేవుడు అన్యాయస్థుడు కాడు. **"దేవుడు అన్యాయము చేయుట అసంభవము సర్వశక్తుడు దుష్కార్యము చేయుట అసంభవము."** – యోబు 34:10 ఆయన చేతికార్యములు సత్యము, న్యాయము. యోబు దేవునియందు భయభక్తులు కలిగి చెడుతనము విసర్జించినవాడు, యథార్థవంతుడు, న్యాయవంతుడు. – **"ఈ సంగతులలో ఏ విషయమందును యోబు ఏ పాపమును చేయలేదు, దేవుడు అన్యాయము చేసెనని చెప్పలేదు."** – యోబు 1:22. యోబు గ్రంథము ఒకటవ అధ్యాయములో చూస్తే యోబుకు ఎన్నో శ్రమలు ఎదురైనవి. ఖడ్గముతో పనివారందరు హతమైనారు; ఆకాశమునుండి అగ్ని పడి గొఱ్ఱెలు, పనివారు చనిపోయారు; శత్రువులు ఒంటెలను కొనిపోయి పనివారిని చంపేశారు; కుమారులు, కుమార్తెలు అన్నపానము చేస్తుండగా సుడిగాలికి గృహము కూలి ఒకే రోజు పది మంది చనిపోయారు. కాని యోబు సమస్తము పోగొట్టుకొనినా దేవుడు చేసే కార్యములు న్యాయమైనవి అంటున్నాడు. దేవుడు అన్యాయము, కీడు చేశాడని చెప్పలేదు; నోటిమాటతోకూడా పాపము చేయలేదు. యెహోవా నామమునకు స్తుతికలుగును గాక. యెహోవా ఇచ్చెను; యెహోవా తీసికొనిపోయెను అన్నాడు.

ఒకరోజు రాత్రి 11 గంటలకు భార్యాభర్తలు వచ్చి తలుపు తట్టారు. విద్యావంతులైన మంచి జంట; వారి చేతిలో చిన్న బిడ్డకూడా ఉంది. వారు క్రొత్తగా వచ్చారు; వారికి ఏమీ తెలియదు. సమస్య ఏమిటంటే –నాదొక బంగారు గాజు పోయిందమ్మా; ఎక్కడపోయిందో తెలియదు; అది దొరకడానికి ప్రార్థించడమ్మా అని వేడుకొన్నారు. వారు విశ్వాసంలో చిన్న బిడ్డలవంటివారు; నూతనముగా దేవుని ఎరుగుచున్నవారు గనుక నేను వారితో గంట సమయము గడిపి దైవకార్యాలు వివరించాను దేవుని కార్యములు సత్యమైనవి న్యాయమైనవి బంగారు గాజు పోయినందుకు దేవుని స్తుతించాను ఎందుకంటే అది పోకుంటే వారు దేవునియొద్దకు రారు. దేవుడు మనఃపూర్వకముగా నీకు బాధ కలుగజేయడు దేవుడు చేయునది నమ్మకమైనది. ఆయన నీతి ఆకాశమండలముకంటె హెచ్చయినది. ఏదైనను ఆయనచేత పిలువబడిన ఆయన సంకల్పములో ఏర్పరచబడినవారికి మేలుకొరకే సమస్తమును సమకూడి జరుగుచున్నవి. ఈ రోజు నీకు కలుగుచున్న బాధ దేవుని నిర్ణయమైయుంది. దేవుడు నిన్ను శ్రమలకొలిమిలో పుటము వేస్తున్నాడు; ఇబ్బందుల కొలిమిలోనుండి తీసికొని వస్తున్నాడంటే దేవుడు నిన్ను చక్కని పనిముట్టుగా, అర్హమైన పాత్రగా, ఆభరణముగా తయారుచేస్తున్నాడు. ఆయన న్యాయము తప్పనివాడు. ఆయన మార్గములు వంకరైనవికావు; ఆయన నిన్ను సూటియైన మార్గములో నడిపిస్తాడు.

## 164. శ్రద్ధ గలవాడు ఐశ్వర్యవంతుడగును.

– సామెతలు 10:4

**"బద్ధకముగా పనిచేయువాడు దరిద్రుడగును శ్రద్ధగలవాడు ఐశ్వర్యవంతుడగును."** – సామెతలు 10:4

ప్రతి విశ్వాసి ఈ వాగ్దానము పొందాలి. నీవు శ్రద్ధకలిగియుంటే నీవు, నీ ఒళ్లు, నీ ఇల్లు, అంతా పుష్టిగా ఉంటుంది. శ్రద్ధ కలిగియున్నవాడు తప్పక ఐశ్వర్యవంతుడౌతాడు; దరిద్రత తొలగిపోతుంది. బద్ధకముగా పనిచేయడము, బద్ధకముతో ఆరాధనకు రావడము సరికాదు. యెహోవా మందిరమునకు చూడవలెనని రండని జనులు నాతో అన్నప్పుడు నేనెంతో సంతోషించితిని; దుప్పి నీటివాగులకొరకు ఆశ పడునట్లు దేవా! నా ప్రాణము నీకొరకు తృష్ణగొనుచున్నదని భక్తులు అంటున్నారు. అది వారికి దేవునిపై ఉన్న శ్రద్ధ. బైబిల్, పాటల పుస్తకము, పెన్ను, డైరీ తీసికొని శ్రద్ధగా దేవుని ఆలయానికి వచ్చి శ్రద్ధగా వాక్యము వింటే దీవింపబడతావు. దేవుని మాటలు శ్రద్ధగా వింటే దేవుడు నిన్ను భూప్రజలందరికంటే ఎక్కువగా హెచ్చిస్తాడు. సాధారణముగా అందరూ వింటారు కాని శ్రద్ధగా వినేవారు అర్థము చేసికొంటారు. శ్రద్ధగా ప్రార్థిస్తే, శ్రద్ధగా వాక్యము పఠిస్తే, శ్రద్ధగా దేవుని పనులు చేస్తే తప్పక నీవు పుష్టిగా ఉంటావు. దేవుని మాట శ్రద్ధగా వింటే ఐగుప్తీయులకు వచ్చిన ఏ రోగము నీకు రాదు! నిన్ను స్వస్థపరచువాడు దేవుడే (నిర్గమకాం. 15:26) దేవుని మాటలు అగ్నివంటివి; ఆ మాటలు నీలోని కల్మషమును కాల్చివేస్తుంది. నీవు శ్రద్ధ కలిగి ఉంటే పైకి వస్తావు. శ్రద్ధగా పనిచేయువారు ఏలుబడి చేస్తారు. నీకు అప్పగింపబడిన పని శ్రద్ధగా చేస్తే నీవు అతితొందర్లో పై స్థానానికి వస్తావు. పని శ్రద్ధగా చేసేవానికే యజమాని ఇంకా ప్రాముఖ్యమైన పనులు అప్పగిస్తాడు. పది మంది పని చేసే చోట యజమాని శ్రద్ధగా నమ్మకముగా పని చేయువానికి తాళపు చెవులు, బాధ్యతలు అప్పగిస్తాడు. ఆలాగుననే నీవు దైవకార్యములు శ్రద్ధగా చేస్తుంటే దేవుడు నీకు పరలోకరాజ్యపు తాళపు చెవులను అప్పగిస్తాడు.

**"శ్రద్ధగా పని చేయువారు ఏలుబడి చేయుదురు సోమరులు వెట్టి పనులు చేయవలసి వచ్చును."** – సామెతలు12:24. సోమరి ఎప్పుడు వెట్టిపనులు (గొడ్డు చాకిరి) చేస్తాడు. శ్రద్ధగా పనిచేసేవాడు క్రమక్రమంగా పైకి వస్తాడు. అతడు దేవుని మాటలు శ్రద్ధగా వింటాడు; ఇచ్చిన పనులు శ్రద్ధగా చేస్తాడు, కావున దేవుడు అతని హెచ్చిస్తాడు. కొందరు పెద్దవారు – అమ్మా, మీ సేవారహస్యమేమిటి? మీరు ఇంత తొందర్లో ఎంతో ప్రాముఖ్యతను పొందారు అని అడుగుతారు. నేను దేవుడు నాకిచ్చిన పనిని శ్రద్ధగా చేస్తూ వెళ్లాను. దేవుడు అప్పగించిన పని దివారాత్రములు శ్రద్ధగా చేశాను. అటూ, ఇటూ తిరిగి సమయము వృధా చేయలేదు. అందుకు దేవుడు మమ్మును హెచ్చించాడు; మేము ప్రబలిపోయాము. దేవుని మాట శ్రద్ధగా చేసినందున దేవుడు మమ్మును ఏలువారిగా చేశాడు. కొద్దిలో నమ్మకముగా ఉన్నవారికి దేవుడు పది పట్టణాల మీద అధికారము అనుగ్రహిస్తాడు. దేవుని కట్టడలు ఎంతో చక్కనవి; వాటిని గైకొనుటవలన మనకు ఎంతో లాభము. శ్రద్ధగలవారి యోచనలు లాభకరములు.

**"సోమరి ఆశపడును గాని వాని ప్రాణమున కేమియు దొరకదు శ్రద్ధగలవారి ప్రాణము పుష్టిగా నుండును."** – సామెతలు 13:4. సోమరి వాడు పనిచేయడు గనుక వాడు ఆశపడినా వానికేమీ దొరకదు. నా యజమాని నాకు ఒక మోటర్ సైకిల్ కొనిస్తే బాగుండు అని అనుకొంటాడు గాని నీవు పనిసరిగ్గా చేయడము లేదని యజమాని గమనిస్తున్నాడు. నామ మాత్రముగా పని చేస్తున్న నీవలన ఏమీ ప్రయోజనము లేదు. నీలో శ్రద్ధలోపిస్తున్నందున నీకు మోటర్ సైకిల్ లభించదు; దైవాశీర్వాదములు పొందలేవు. నీవు శ్రద్ధగా పని చేసిచూడు దేవుడు సంఘాలనే నీకు అప్పగిస్తాడు. మానవులు ఏపాటివారు. కావున నీవు శ్రద్ధగా దైవకార్యాలు చేయ రాబోవుకాలములో దేవుడు నిన్ను ఏ విధముగా చేస్తాడో. నీవు తలగా ఉంటావు గాని తోకగా ఉండవు; నీవు పైవానిగా ఉంటావు గాని

క్రిందివానిగా ఉండవు. ప్రసంగము శ్రద్ధగా విని వ్రాసికొని ధ్యానించి గృహకూడికల్లో తిరిగి దానిని బోధించడముద్వారా దేవుడిచ్చిన అవకాశాలు ఉపయోగించుకొంటూ పోతే నీకు పేదరికము ఉండదు. వాక్యము బోధించినవారిని జనులు వట్టిగా పంపించరు. ఒకసారి ఒక కుటుంబము వచ్చి నన్ను ఆహ్వానించారు; నాకు వీలు కాదని చెప్పి 20 మందిని ఆ గృహకూడికకు పంపాను. ఆరోజు సాయంత్రము నాలుగు గంటలవరకు ప్రార్థనలు చేశారు. నేను వారు అలసిపోయి వస్తారు; వారికి ఏదైనా ఆహారము సిద్ధపరచాలి; కాని పనివారు లేరు అని ప్రార్థించాను. అయితే వారు తిరిగివచ్చినప్పుడు సంతృప్తిగా ఉన్నారు. వారు అక్కడికి వెళ్లి ప్రార్థించి, పాటలు పాడి, వాక్యము పంచుకొని ఆ కుటుంబాన్ని ఆదరించారు. వారి కుటుంబములో 23 సంవత్సరాల కుమారుడు చనిపోయాడు. అతని మొదటి వర్ధంతి వీరు శ్రద్ధగా దేవుని పని చేశారు. దేవుడు వారిని ఖాళీగా పంపలేదు. వారు అక్కడ ఆకుటుంబీకులు ఇచ్చిన విందు కడుపునిండ ఆరగించి వచ్చారు. దేవుడు గొప్పవాడు. యెహోవా ఉత్తముడని రుచిచూచి తెలిసికోవాలి. దేవుని మాటలు శ్రద్ధగా వింటే నీ బ్రతుకంతా రుచియే. కావున శ్రద్ధ కలిగియుండాలి.

నేను మా నాన్నగారిలో ఆ శ్రద్ధను గమనించాను. ఆయనకు ఒక డైరీ, ఒక బైబిల్ ఉండేది. అవి, అతని బట్టలు, చేతి రుమాళ్లు అన్నీ చక్కగా అమర్చి వేటి స్థానంలో అవి ఉండేవి. నేను నా తండ్రిగారినుండి శ్రద్ధ నేర్చుకొన్నాను. మా అమ్మ దేవుని కార్యాలు శ్రద్ధగా, నిష్ఠతో చేసేది. ప్రభు బల్ల ఎంతో శ్రద్ధతో, గౌరవంతో సిద్ధపరచేది. స్నానము చేసి గది అంతా శుభ్రము చేసి బల్ల సర్ది ప్రార్థన చేసి ప్రభుబల్ల సిద్ధము చేసేది. వారమంతా బూతులు మాట్లాడి ఆదివారం వచ్చి హంగామా చేసి అశ్రద్ధగా ప్రభుబల్ల సిద్ధపరచుటకు వీలు కాదు, కుదరదు. ప్రభు బల్ల సిద్ధపరచువారు ఒక పూట ఉపవాసము ఉండి ప్రార్థించి నీ దేహాన్ని సిద్ధపరచుటకు నన్ను ఏర్పరచుకొన్నావని స్తుతించి శ్రద్ధగా చేయాలి. శ్రద్ధగా ఉంటే నీ ప్రాణం పుష్టిగా ఉంటుంది. సోమరి ఆశపడును గాని వానికేమియు దొరకదు. సోమరి వేటాడినా పట్టుకోడు. సోమరి ఆశించినను వానికి దొరకదు. శ్రద్ధ గలవాడు పనిచేస్తాడు; దేవుని మాట శ్రద్ధగా విని దేవుని నియమాలు పాటిస్తాడు. అతని జీవితములో క్రమముంది. కావున పైకి వస్తాడు. మనము దేవునిపట్ల శ్రద్ధ నిలిపినప్పుడు దేవుడు మనపట్ల శ్రద్ధ నిలుపుతాడు. **"నీవు జాగ్రత్తగా దేవుని వెదకినయెడల సర్వశక్తుడగు దేవుని బతిమాలుకొనినయెడల నీవు పవిత్రుడవై యథార్థవంతుడవైనయెడల నిశ్చయముగా ఆయన నీయందు శ్రద్ధ నిలిపి నీ నీతికి తగినట్టుగా నీ నివాసస్థలమును వర్ధిల్లజేయును. అప్పుడు నీ స్థితి మొదట కొద్దిగా నుండినను తుదను నీవు మహాభివృద్ధి పొందుదువు."** - యోబు 8:5-7. ఒకప్పుడు నీవు సైకిల్ త్రొక్కుతూ ఉద్యోగానికి వెళ్లి శ్రద్ధగా దేవుని వెదకి ఇప్పుడు పెద్ద కారులో ఉద్యోగానికి వెళ్తున్నావు. ఒకప్పుడు అద్దె గదికొరకు వీధి వీధి వెదకావు. ఇప్పుడు పెద్ద భవనము నిర్మించుకొన్నావు. నీవు శ్రద్ధగా దేవుని వెదకితే దేవుడు నీయందు శ్రద్ధనిలిపి నీ నీతికి తగినట్లు నీ గుడార స్థలమును వర్ధిల్లజేస్తాడు. అప్పుడు నీ నీతి మొదట కొద్దిగా ఉన్నా తుదను నీవు మహాభివృద్ధి నొందుతావు.

## 165. నీవు నా యెదుట చేసిన ప్రార్థన నేను అంగీకరించి యున్నాను. - 2 రాజులు 19:20

మనము దేవునియెదుట చేసిన ప్రతి ప్రార్థనను దేవుడు అంగీకరించి జవాబును అనుగ్రహించాలని ఆశిస్తాము. హిజ్కియా రాజుతో దేవుడు సెలవిస్తున్నాడు - నీవు నాయెదుట చేసిన ప్రార్థనను నేను అంగీకరించియున్నానని. ఈ వాగ్దానము విశ్వాసముద్వారా అందరము పొందాలి. కొన్నిసార్లు కొన్ని ప్రార్థనలకు జవాబు రాదు. హృదయములో పాపము లక్ష్యము చేస్తే దేవుడు మన మనవి వినడు. విననేరక యుండునట్లు ఆయన చెవులు మందము కాలేదు. రక్షింపనేరక యుండునట్లు ఆయన హస్తము కురుచకాలేదు. మీ పాపములే మీకు దేవునికి మధ్యలో అడ్డుగా నిలబడతాయి. అందుకే ప్రార్థన చేసేటప్పుడు మొట్టమొదట నీ హృదయమును పరీక్షించుకోవాలి. పాపముంటే తొలగించుకోవాలి. దేవునికి ఆయాసకరమైన మార్గము ఏదైనా ఉంటే విడిచి పెట్టాలి. పవిత్రమైన హృదయముతో చేసే ప్రతి ప్రార్థనను దేవుడు అంగీకరిస్తాడు.

**"నా హృదయములో నేను పాపమును లక్ష్యము చేసినయెడల ప్రభువు నా మనవి వినకపోవును."** - కీర్తనలు 66:18

**"రక్షింపనేరక యుండునట్లు యెహోవా హస్తము కురుచకాలేదు. విననేరక యుండునట్లు ఆయన చెవులు మందము కాలేదు. మీ దోషములు మీకును మీ దేవునికిని అడ్డముగా వచ్చెను. మీ పాపములు ఆయన ముఖమును మీకు మరుగు పరచెను గనుక ఆయన ఆలకింపకున్నాడు."**

- యెషయా 59:1,2

నీవు నాయెదుట చేసిన ప్రార్థనను నేను అంగీకరించి యున్నానని దేవుని వాగ్దానము. ఈ రోజు వాక్యము ధ్యానిస్తున్న వారిలో ప్రతి ఒక్కరు ఏదో ప్రార్థనకు జవాబుకొరకు ఎదురుచూస్తుంటారు. కొందరికి ఆరోగ్యము కావాలి, కొందరికి ఆర్థిక సమస్యలు అప్పులు తీరిపోవాలి. కొందరికి కుటుంబములో సమాధానము కావాలి, పిల్లలకు చక్కని భవిష్యత్తు కలిగియుండాలని, కొందరికి ఉద్యోగము కావాలని, కొందరికి శత్రువుల బారినుండి విడిపింపబడాలని, కొందరికి సొంత గృహాలు కావాలని సొంత వాహనములు కావాలని ఇలా చెప్పుకుంటూ వెళితే ప్రత ఒక్కరికి ఏదో ఒక ప్రార్థనాంశము ఉంటూనే ఉంటుంది. మన ప్రార్థనలు, విజ్ఞాపనలు యాచనలు అన్నీ దేవునికి తెలియజేస్తూ, ఆయన సన్నిధిలో మొఱ్ఱపెడుతున్నాము. ఆయన ప్రార్థనలు ఆలకించే దేవుడు. తనయందు భయభక్తులు గలవారి కోరికను ఆయన నెరవేరుస్తాడు. నీతిమంతుల ప్రార్థన బహుబలము గలదైయుంటుంది. నీతిమంతులు ఆశించినది వారు పొందుతారు.

హిజ్కియారాజు శత్రువుల బారినుండి తప్పింపబడాలని ప్రార్థన చేస్తున్నాడు. శత్రురాజులు హిజ్కియారాజు నమ్మిన దేవుని నామమును దూషిస్తూ, నీ దేవుడు ఎంతటివాడు? మేము నిన్ను అంతమొందిస్తామని బెదిరింపు ఉత్తరము పంపుతారు. అప్పుడు హిజ్కియా రాజు దేవుని మందిరమునకు వెళ్లి ఆయన బలిపీఠము యొద్ద దానిని విప్పి పరచి యెహోవా సన్నిధిలో ప్రార్థన చేశాడు.

**"యూదారాజగు హిజ్కియాతో ఈలాగు చెప్పుడి - యెరూషలేము అష్షూరురాజు చేతికి అప్పగింపబడదని చెప్పి నీవు నమ్ముకొనియున్న నీ దేవునిచేత మోసపోకుము. ఇదిగో అష్షూరు రాజులు సకల దేశములను బొత్తిగా నశింపజేసిన సంగతి నీకు వినబడినది గదా నీవు మాత్రము తప్పించుకొందువా? నా పితరులు నిర్మూలము చేసిన గోజానువారు గాని, హారానువారు గాని, రెజెపులు గాని, తెలశ్శారులో నుండిన ఏదెనీయులు గాని తమ దేవతల సహాయమువలన తప్పించుకొనిరా? హమాతు రాజు ఏమాయెను? అర్పాదురాజును సెపర్వయీము హేన ఇవ్వా అను పట్టణముల రాజులును ఏమైరి? హిజ్కియా దూతలచేతిలో నుండి ఆ ఉత్తరము తీసికొని చదివి, యెహోవా మందిరములోనికి పోయి యెహోవా సన్నిధిని దాని విప్పి పరచి యెహోవా సన్నిధిని ఇట్లని ప్రార్థన చేసెను - యెహోవా, కెరూబుల మధ్యను నివసించుచున్న ఇశ్రాయేలీయుల దేవా, భూమ్యాకాశములను కలుగజేసిన అద్వితీయ దేవా, నీవు లోకమందున్న సకల రాజ్యములకు దేవుడవైయున్నావు. యెహోవా, చెవియొగ్గి ఆలకింపుము; యెహోవా, కన్నులు**

**తెరచి దృష్టించుము; జీవముగల దేవుడవైన నిన్ను దూషించుటకై సన్హెరీబు పంపినవాని మాటలను చెవినిబెట్టుము. యెహోవా, అష్షూరురాజులు ఆ జనములను వారి దేశములను పాడుచేసి వారి దేవతలను అగ్నిలో వేసినది నిజమే. ఆ రాజ్యముల దేవతలు నిజమైన దేవుండ్లు కాక మనుష్యులచేత చేయబడిన కఱ్ఱలు రాళ్లే గనుక వారు వారిని నిర్మూలము చేసిరి. యెహోవా మా దేవా, లోకమందున్న సమస్త జనులు నీవే నిజముగా అద్వితీయ దేవుడవైన యెహోవావని తెలిసికొనునట్లుగా అతని చేతిలోనుండి మమ్మును రక్షింపుము."** – 2 రాజులు 19:10-19.

శత్రువుల బెదిరింపులకు హిజ్కియా రాజు భయాందోళనలకు, కలవరమునకు గురికాకుండ దేవుని సన్నిధికి వెళ్లి, దేవుడు ఏమైయున్నాడో ఆయనను స్తుతించి తన మనవులు తెలియజేశాడు. మనలో ఎవరికైనా ఇలాంటి సందర్భము వస్తే భయము, ఆందోళన చెందకుండ హిజ్కియా రాజువలె దేవుని మందిరమునకు వెళ్లి మన భయములన్నీ దేవునికి తెలియజేయాలి. దేవుని బిడ్డలు దేవునిని ఆశ్రయించినప్పుడు దేవుడు వారి యెదుటనుండి వారి శత్రువులను పారద్రోలుతాడు. దేవునికి స్తోత్రము. హల్లెలూయ. నీ మధ్యనుండి నీ శత్రువులను వెళ్లగొడతాడు. వారు ఒకదారిలో నీ మీదకు వస్తే దేవుడు వారిని తరిమి కొట్టినప్పుడు ఏడు దారులలో తిరిగి వెళతారు. యుద్ధము యెహోవాదే. దేవుడు మన ప్రార్థనలు అంగీకరించి మన పక్షముగా తానే యుద్ధము చేసి జయమును అనుగ్రహిస్తాడు. దేవునియెదుట చేసిన ప్రార్థనను దేవుడు అంగీకరించాలంటే చిత్తశుద్ధితో యథార్థహృదయముతో చేయాలి. హిజ్కియారాజు యథార్థపరుడు. దేవుని వెదికేవాడు. దేవునితో సన్నిహిత బంధము కలిగి దేవునియెదుట నీతి న్యాయములు కలిగి నడుచుకున్నాడు. అందుకే దేవుడు అతని శత్రువుల విషయములో జోక్యము చేసికొని శత్రువులను పారద్రోలాడు.

**"అంతట ఆమోజు కుమారుడైన యెషయా హిజ్కియాయొద్దకు ఈ వర్తమానము పంపెను – ఇశ్రాయేలీయుల దేవుడగు యెహోవా సెలవిచ్చునదేమనగా – అష్షూరురాజైన సన్హెరీబు విషయమందు నీవు నా యెదుట చేసిన ప్రార్థన నేను అంగీకరించియున్నాను."**

– 2 రాజులు 19:20.

**"నామీద నీవు వేయు రంకెలును నీవు చేసిన కలహమును నా చెవులలో జొచ్చెను గనుక నా గాలమును నీ ముక్కునకు తగిలించెదను. నా కళ్లెము నీ నోటిలో పెట్టి నిన్ను మళ్లించెదను. నీవు వచ్చిన మార్గముననే నిన్ను మళ్లించెదను."** – 2 రాజులు 19:28. అని దేవుడైన యెహోవా శత్రువైన అష్షూరురాజునుగూర్చి తెలియజేస్తున్నాడు. నీవు నన్ను దూషించిన మాటలు నాకు వినబడినవి. నీవు వచ్చిన మార్గముననే నిన్ను మళ్లించెదనని అంటున్నాడు.

**"కాబట్టి అష్షూరురాజునుగూర్చి యెహోవా సెలవిచ్చునదేమనగా – అతడు ఈ పట్టణములోకి రాడు; దానిమీద ఒక బాణమైన ప్రయోగింపడు; ఒక కేడెమునైన దానికి కనుపరచడు; దానియెదుట ముట్టడిదిబ్బ కట్టడు. ఈ పట్టణములోపలికి రాక తాను వచ్చిన మార్గముననే అతడు తిరిగిపోవును; ఇదే యెహోవా వాక్కు. నా నిమిత్తమును నా సేవకుడైన దావీదు నిమిత్తమును నేను ఈ పట్టణమును కాపాడి రక్షించుదును.**

**ఆ రాత్రియే యెహోవా దూత బయలుదేరి అష్షూరు వారి దండుపేటలో జొచ్చి లక్ష యెనుబది అయిదు వేలమందిని హతము చేసెను. ఉదయమున జనులేచి చూడగా వారందరును మృతకళేబరములై యుండిరి."**

– 2 రాజులు 19:32-35

దేవుని దూత యుద్ధముచేసి లక్షా యెనుబది వేలమందిని ఒకే రాత్రిలో హతము చేసింది. హిజ్కియా నమ్ముకొనిన ఆయన ఆరాధిస్తున్న జీవముగల దేవుడు సైన్యములకధిపతియగు యెహోవా కలుగజేసికొని హిజ్కియారాజుకు గొప్ప విజయమును అనుగ్రహించాడు. దేవునికి స్తోత్రములు. మనము ఎప్పుడైతే దేవుని నియమములలో ఉంటామో ఆయన ఆజ్ఞలు కట్టడలు అనుసరిస్తూ ఆయనయందు భయభక్తులు గలిగి చెడుతనమును అసహ్యించుకుంటామో ఆయన మన పక్షమున వ్యాజ్యెమాడుతాడు. నీ పక్షముగా యుద్ధము చేస్తాడు. నీ ప్రార్థనలన్నీ అంగీకరిస్తాడు. నీ కార్యములన్నీ ఆయనే సఫలపరుస్తాడు. మన ప్రార్థనలు ధూపము వలే ఆయన సన్నిధి చేరాలంటే పవిత్రమైన చేతులెత్తి ప్రార్థించాలి.

**"యెహోవా నేను నీకు మొఱ్ఱపెట్టుచున్నాను. నాయొద్దకు త్వరపడి రమ్ము. నేను మొఱ్ఱపెట్టగా నా మాటకు చెవియొగ్గుము. నా ప్రార్థన ధూపము వలెను నేను చేతులెత్తుట సాయంకాల నైవేద్యమువలెను నీ దృష్టికి అంగీకారములగును గాక."** – కీర్తనలు 141:1,2. అని దావీదు భక్తుడు ప్రార్థన చేశాడు.

మన ప్రార్థనలు దేవుని సన్నిధిలో అంగీకారముగా ఉండాలి నీవు నా యెదుట చేసిన ప్రార్థనను నేను అంగీకరిస్తానని దేవుడు వాగ్దానము చేశాడు. కాబట్టి నీవు ఎలాంటి పరిస్థితిలో ఉన్నా నీ సమస్య ఏదైనా దేవుని సన్నిధిలో మొఱ్ఱపెట్టు. ఆయన నీ ప్రార్థనలు ఆలకిస్తాడు. నీ మనవులు అంగీకరిస్తాడు. ప్రార్థించేవారు పరిస్థితులకు భయపడరు గాని వారి భయములన్నీ దేవుని సన్నిధిలో తెలియజేసి విడుదల పొందుతారు.

హిజ్కియా రాజుకు అనారోగ్యము కలిగినప్పుడుకూడ దేవునినే ఆశ్రయించాడు. మరణకరమైన రోగము కలిగినప్పుడు వైద్యులను ఆశ్రయించేముందు దేవుని ఆశ్రయించి ఆయన సన్నిధిలో కన్నీటితో మొఱ్ఱపెట్టాడు. దేవుడు అతని ప్రార్థన ఆలకించి అతనిని స్వస్థపరచి ఇంకా పదిహేను సంవత్సరములు ఆయుష్షును పొడిగించాడు.

**"ఆ దినములలో హిజ్కియాకు మరణకరమైన రోగము కలుగగా, ఆమోజు కుమారుడును ప్రవక్తయునైన యెషయా అతనియొద్దకు వచ్చి – నీవు మరణమవుచున్నావు, బ్రదుకవు గనుక నీవు నీ యిల్లు చక్కబెట్టుకొనుమని యెహోవా సెలవిచ్చుచున్నాడని చెప్పగా అతడు తన ముఖము గోడతట్టు త్రిప్పుకొని – యెహోవా, యథార్థహృదయుడనై సత్యముతో నీ సన్నిధిని నేనెట్లు నడుచుకొంటినో, నీ దృష్టికి అనుకూలముగా సమస్తమును నేనెట్లు జరిగించితినో కృపతో జ్ఞాపకము చేసికొనుమని హిజ్కియా కన్నీళ్లు విడుచుచు యెహోవాను ప్రార్థించెను.**

**యెషయా నడిమిశాలలో నుండి అవతలకు వెళ్లకమునుపే యెహోవా వాక్కు అతనికి ప్రత్యక్షమై ఈలాగు సెలవిచ్చెను – నీవు తిరిగి నా ప్రజలకు అధిపతియైన హిజ్కియాయొద్దకు పోయి అతనితో ఇట్లనుము నీ పితరుడైన దావీదునకు దేవుడగు యెహోవా నీకు సెలవిచ్చునదేమనగా – నీవు కన్నీళ్లు విడుచుట చూచితిని; నీ ప్రార్థన నేనంగీకరించియున్నాను; నేను నిన్ను బాగుచేసెదను."** – 2 రాజులు 20:1-5

హిజ్కియారాజు దేవునికి జ్ఞాపకము చేస్తున్నాడు. యథార్థహృదయుడనై, సత్యమును అనుసరిస్తూ నీదృష్టికి అనుకూలముగా సమస్తమును ఏ విధముగా జరిగించానో కృపతో జ్ఞాపకము చేసికొనమని కన్నీళ్లు విడుచుచు ప్రార్థించగానే కృపగల దేవుడు వెంటనే యెషయా ప్రవక్తద్వారా తన వాక్కును తెలియజేశాడు. నీవు కన్నీళ్లు విడుచుట నేను చూచితిని. నీ ప్రార్థన నేను అంగీకరించియున్నాను. నేను నిన్ను బాగుచేసెదనని వాగ్దానమిచ్చాడు. ప్రార్థనలు ఆలకించే దేవుడు మనముకూడ ఆయన సన్నిధిలో యథార్థహృదయముతో చేసే ప్రతి ప్రార్థనను ఆయన అంగీకరిస్తాడు. దేవునికి స్తోత్రము. హల్లెలూయ.

# దేవుని వెయ్యి ఆదేశములు

ధారావాహిక

## 231. “మెలకువగా ఉండుడి, విశ్వాసమందు నిలుకడగా ఉండుడి, పౌరుషముగలవారై యుండుడి, బలవంతులైయుండుడి.”

– 1 కొరింథీ. 16:13

ప్రతి విశ్వాసి విశ్వాసజీవితములో మెలకువగా ఉండాలి. ప్రార్థనయందు, కృతజ్ఞతాస్తుతులు చెల్లించుటయందు, అబద్ధప్రవక్తలనుగూర్చి తప్పుడు బోధలగూర్చి, ఆత్మీయజీవితము పతనముకాకుండునట్లు శోధనలో పడకుండునట్లు ఎల్లప్పుడు మెలకువకలిగియుండాలి. విశ్వాసమందు నిలుకడగా ఉండాలి. తొమ్మిది వరాల్లో విశ్వాసము గొప్పవరము. నీ హృదయంలో దేవునిపై అచంచలమైన విశ్వాసము కలిగియుండాలి. విశ్వాసముతో దేవుని వాక్యాన్ని అంగీకరిస్తావు హృదయమందు విశ్వసించి యేసుప్రభువు అన్నింటిమీద అధికారముగలవాడని ప్రభువు అని రక్షకుడని నీ విశ్వాసాన్ని వదులుకొనక విశ్వాసములో నిలుకడగా ఉండాలి. విశ్వాసము విడిచిపోవునట్టి భ్రష్టత్వము నీలో ఉండకూడదు. అంతమువరకు నీ విశ్వాసమును కాపాడుకోవాలి. శ్రమల్లో ఓపికకలిగి ఉండాలి. కొందరికి శ్రమలు రాగానే వారి విశ్వాసము సన్నగిల్లిపోతుంది. దేవుడు మాకేమి చేశాడు? దేవుడు ఉన్నాడా? అంటారు. మనము ఆలాగు ఉండక శ్రమల్లో ఆనందించాలి; నిరీక్షణకలిగి సంతోషించాలి; ప్రార్థనలో పట్టుదలకలిగి ఉండాలి. దేవుని సెలవులేకుండా మన జీవితములో ఏదీ సంభవించదు; ఆయన అంతమువరకు మనలను నడిపించి నిత్యరాజ్యములోకి తీసికెళ్తాడు. నీవు నీ విశ్వాసములో ఎటూ తొట్రిల్లకుండ స్థిరముగా ఉండాలి; ఆయనయందు నీకున్న ప్రగాఢమైన విశ్వాసమును నిలుపుకోవాలి.

దేవుని పిల్లలు పౌరుషము, రోషము కలిగియుండాలి. రోషము అన్నప్పుడు ఇతరుతలతో కలహాలు చేయాలని కాదు; నీవు ఈ లోకంలో విలువైన దేవుని సొత్తు అని గ్రహించాలి. నీవు యేసుక్రీస్తు రక్తమంత విలువకలిగినవాడివనే పౌరషము కలిగి ఉండాలి. సంఘము యేసుక్రీస్తు తన స్వరక్తమిచ్చి సంపాదించినది. కావున సంఘములో వ్యతిరేకమైన బోధలు, తప్పుడు మార్గములు ఉంటే నీకు పౌరుషము కలగాలి. నీవు సమస్యనుగూర్చి ప్రార్థించాలి; వీలైతే హెచ్చరించాలి. నీతి, భక్తి, పవిత్రతగూర్చిన పౌరుషము నీకు ఉండాలి. ఇది మనకు మేలుకరము. మనము దిక్కులేనివారము, దారి తప్పినవారము కాదు. గొప్ప సాక్షి సమూహము మేఘమువలె మనలను ఆవరించియున్నది (హెబ్రీ 12:1). భక్తులు మనముందు మార్గదర్శకులుగా ఉన్నారు. మన పితరులు దేవునియందు విశ్వాసముంచి వారు సిగ్గుపడలేదు. ఆయన తరతరములకు యుగయుగములకు దేవుడు. ఆయన నీతి పిల్ల పిల్ల తరమునకు ఉంటుంది. కావున మనము దేవునియందు బలవంతులమై ఉండాలి.

## 232. “దేవుని దినపు రాకడకొరకు కనిపెట్టుచు, దానిని ఆశతో అపేక్షించుచు, మీరు పరిశుద్ధమైన ప్రవర్తనతోను భక్తితోను ఎంతో జాగ్రత్తగలవారై యుండవలెను.”

– 2 పేతురు 3:12

విశ్వాసి పరిశుద్ధమైన ప్రవర్తన, భక్తి, జాగ్రత్త కలిగి ఉండాలి. మనము యేసుప్రభువుయొక్క రెండవ రాకడకొరకు ఆశతో కనిపెడుతున్నాము. **“అయితే ప్రభువు దినము దొంగవచ్చినట్లు వచ్చును. ఆ దినమున ఆకాశములు మహాధ్వనితో గతించి పోవును, పంచభూతములు మిక్కటమైన వేండ్రముతో లయమైపోవును, భూమియు దానిమీదనున్న కృత్యములును కాలిపోవును. ఇవన్నియు ఇట్లు లయమైపోవునవి గనుక, ఆకాశములు రవులుకొని లయమైపోవునట్టియు, పంచభూతములు మహావేండ్రముతో కరిగిపోవునట్టియు, దేవుని దినపు రాకడకొరకు కనిపెట్టుచు, దానిని ఆశతో అపేక్షించుచు, మీరు పరిశుద్ధమైన ప్రవర్తనతోను భక్తితోను ఎంతో జాగ్రత్తగలవారై యుండవలెను.”** – 2 పేతురు 3:10-12. యేసుప్రభువు యొక్క రెండవరాకడలో జరుగబోయే కార్యములు ఎలాగు ఉంటాయో పేతురు భక్తుడు స్పష్టముగా వ్రాస్తున్నాడు. అయితే ప్రభువు దినముకొరకు కనిపెట్టుకొనిన విశ్వాసులు ఏ విధముగా ఉండాలి? ప్రభువు దినము త్వరగా రావాలని విశ్వాసి కాచుకొనియుండాలి. ప్రభువు ఎంత త్వరగా వస్తే అంత త్వరగా మన ఇహలోక బాధలన్నీ తొలగిపోతాయి; మనము ప్రభువుతో ఉంటామని మనము ఆ మహా దినముకొరకు ఎదురుచూస్తున్నాము. ఆలాగు ఎదురుచూసే విశ్వాసులు పవిత్రమైన ప్రవర్తన, భక్తి కలిగి బహు జాగ్రత్తగా జీవించాలి. అజాగ్రత్త, అశ్రద్ధ చేయకూడదు. పరిశుద్ధాత్ముడు ఎప్పుడూ విశ్వాసులను ప్రేరేపిస్తాడు; పురికొల్పుతాడు, సహాయము చేస్తాడు; బలహీనత ఎత్తి చూపి బలము అనుగ్రహిస్తాడు. ఈలోకములో భక్తికలిగి బహు జాగ్రత్తగా జీవించాలి. దేవుడు తన భక్తుల ప్రవర్తనను కాపాడుతాడు. దేవుడు నీ నోరు, తలంపులు, నడవడి, చర్యలు, ఆలోచనలు కాపాడుతాడు. పరిశుద్ధాత్ముడు నిన్ను గద్దిస్తాడు; నీవు మాటి మాటికి తప్పుచేస్తే పరిశుద్ధాత్ముడు దుఃఖపడుతాడు. ఇవన్నీ విశ్వాసి జీవితంలో అనుభవమౌతాయి. మనము ప్రభువు రెండవ రాకడకొరకు ఎదురుచూస్తున్నాము గనుక విశ్వాసి మెలకువ, భక్తి, శ్రద్ధ, జాగ్రత్త, పవిత్ర ప్రవర్తన కలిగియుండి అనేకులకు సువార్త ప్రకటిస్తే ప్రభువు జాగు చేయక వస్తాడు. అయితే విశ్వాసులు కొన్ని కార్యములను పాటించవలసియుంటుంది. ఒకటి, విశ్వాసులు దేవునికి సంపూర్ణమైన విధేయతను చూపాలి; మనము ఆయన మాటలను అనుసరించి లోకములో జీవించాలి. రెండవది, ఆయన రాజ్యము వచ్చునట్లు ప్రతరోజు ప్రార్థించాలి. **“యేసు వారితో ఇట్లనెను – ఎవడును మిమ్మును మోసపరచకుండ చూచుకొనుడి అనేకులు నా పేరట వచ్చి – నేనే క్రీస్తునని చెప్పి పలువురిని మోసపరచెదరు. మరియు మీరు యుద్ధములనుగూర్చియు యుద్ధసమాచారములను గూర్చియు వినబోదురు; మీరు కలవరపడకుండ చూచుకొనుడి. ఇవి జరుగవలసియున్నవి గాని అంతము వెంటనే రాదు. జనముమీదికి జనమును రాజ్యముమీదికి రాజ్యమును లేచును. అక్కడక్కడ కరవులును భూకంపములును కలుగును; ఇవన్నియు వేదనలకు ప్రారంభము. అప్పుడు జనులు మిమ్మును శ్రమలపాలుచేసి చంపెదరు; మీరు నా నామము నిమిత్తము సకల జనములచేత ద్వేషింపబడుదురు. అనేకులు అభ్యంతరపడి, యొకనినొకడు అప్పగించి యొకనినొకడు ద్వేషింతురు. అనేకులైన అబద్ధ ప్రవక్తలు వచ్చి పలువురిని మోసపరచెదరు; అక్రమము విస్తరించుటచేత అనేకుల ప్రేమ చల్లారును. అంతమువరకు సహించినవాడెవడో వాడే రక్షింపబడును. మరియు ఈ రాజ్యసువార్త సకల జనములకు సాక్ష్యార్థమై లోకమందంతటను ప్రకటింపబడును, అటుతరువాత అంతము వచ్చును.”** – మత్తయి 24:4-14. అంత్యదినములలో అబద్ధప్రవక్తలు వస్తారు, నేనే క్రీస్తునని చెప్పి మోసగిస్తారు; కావున నీవు మెలకువ కలిగి నీ భక్తి జీవితమును కాపాడుకోవాలి. యుద్ధములు, కరవులు, భూకంపములు కలుగుతాయి, అనేక సంఘటనలు జరుగుతాయి. మొదట సువార్త లోకమందంతట ప్రకటింపబడాలి. అటుతర్వాతే అంతము వస్తుంది. నేను చిన్నదానిగా

ఉన్నప్పుడు ఈ వాక్యము నాకు అర్థముకాలేదు. సువార్త ఏలాగు భూదిగంతము లవరకు ప్రకటింపబడుతుంది? అంతము ఎప్పుడు వస్తుంది? అనుకొన్నాను. ఇప్పుడు నా అనుమానము తేలిపోయింది. ఇప్పుడు అనేక మాధ్యములద్వారా 24 గంటలు భూదిగంతములవరకు సువార్త ప్రకటింప బడుతుంది. కావున ప్రభువు త్వరలో రానైయున్నాడని మనము గ్రహించాలి. పెండ్లి కుమార్తెయైన సంఘము వరుడైన ప్రభువును ఎదుర్కొనుటకు ఎంతగానో సిద్ధపడాలి. ఆయన రాకడలో మనము ఎత్తబడునట్లు ప్రభువు మనలను కళంకము మచ్చ, ముడత లేకుండా పవిత్రమార్గములో నడిపిస్తు సంఘమును సిద్ధము చేస్తున్నాడు. అజాగ్రత్తగల విశ్వాసిగా ఉండవద్దని ఈ ఆదేశము మనలను హెచ్చరిస్తుంది.

## 233. "మీరు పాపము విషయమై మృతులుగాను, దేవుని విషయమై క్రీస్తుయేసునందు సజీవులుగాను మిమ్మును మీరే యెంచుకొనుడి." – రోమా 6:11

మనము ఎప్పుడైతే యేసుప్రభువును రక్షకునిగా స్వీకరించామో అప్పుడు పాపము విషయమై మృతులమయ్యాము. కాని క్రీస్తుయేసునందు సజీవులముగా ఉన్నాము. పాపము మనలను ప్రేరేపించినా ఆకర్షించినా దానికి ప్రతిస్పందించక క్రీస్తు మనలో ఉన్నందున మనము దానిని జయిస్తున్నాము. మన హృదయములో క్రీస్తు నివసిస్తున్నందున పాపానికి మృతులమై యున్నాము. పాపము విషయమై మనము చనిపోయాము గనుక ఇకమీదట పాపము చేయలేము. ఇకను పాపములో జీవించలేము. క్రీస్తు మనలో జీవిస్తున్నాడు గనుక క్రీస్తుతోకూడా మనము బ్రతుకుతున్నాము. పాపముమీద అధికారము పొంది క్రీస్తుతోకూడ జయిస్తున్నాము అని దీని అర్థము.

**"క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా? కాబట్టి తండ్రి మహిమవలన క్రీస్తు మృతులలోనుండి యేలాగు లేపబడెనో, ఆలాగే మనమును నూతనజీవము పొందినవారమై నడుచుకొనునట్లు, మనము బాప్తిస్మమువలన మరణములో పాలుపొందుటకై ఆయనతోకూడ పాతిపెట్టబడితిమి."** – రోమా 6:3-4

విశ్వాసి బాప్తిస్మము తీసికున్నప్పుడు యేసుక్రీస్తుయొక్క మరణ పునరుత్థానముల అనుభవాన్ని పొందుతున్నాడు. నీళ్లలోకి దిగి బాప్తిస్మము పొందునప్పుడు యేసుప్రభువుయొక్క మరణానుభవమునకు సూచనగా మునిగి పునరుత్థానమునకు సూచనగా (అనగా క్రీస్తును ధరించుకొని) తిరిగి లేస్తున్నాడు కాబట్టి మనము పాపముమీద అధికారము గలవారమై పాపము విషయంలో మృతులమైయున్నామని జ్ఞాపకముంచుకోవాలి.

**"ఏమనగా మనమికను పాపమునకు దాసులము కాకుండుటకు పాపశరీరము నిరర్థకమగునట్లు, మన ప్రాచీన స్వభావము ఆయనతోకూడ సిలువవేయబడెనని యెరుగుదుము."** – రోమా 6:6

ప్రాచీన స్వభావము అనగా రక్షింపబడక ముందున్న పాపజీవితము. యేసుప్రభువును అంగీకరించినతర్వాత ఆ పాపజీవితము (స్వభావము) సిలువవేయబడింది. **"నేను క్రీస్తుతోకూడ సిలువవేయబడియున్నాను; ఇకను జీవించువాడను నేను కాను, క్రీస్తే నాయందు జీవించుచున్నాడు."** – గలతీ 2:20 అని పౌలు భక్తుడు అంటున్నాడు. **"నేను జీవించుచున్నాను గనుక మీరును జీవింతురు."** – యోహాను 14:19 అని యేసుప్రభువు చెప్పాడు. మనము ఒకప్పుడు అపరాధములచేత పాపముచేత చచ్చినవారము. కాని తండ్రియైన దేవుడు కుమారుడైన యేసుక్రీస్తును మనకొరకు సిలువ బలియాగముద్వారా రక్తము చిందించుటకు తద్వారా మనకు పాపవిమోచన కలుగుటకు ఆయనను లోకమునకు పంపాడు. గనుక చనిపోయినవారమైన మనకు క్రీస్తుద్వారా గొప్ప జీవము లభించింది. సమృద్ధియైన జీవము పొందినవారముగా ఉన్నాము. దేవునికి స్తోత్రములు. ❁


"పరాక్రమముగల శూరునివలె యెహోవా నాకు తోడైయున్నాడు..." - యిర్మీయా 20:11

యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ (యు.పి.ఎఫ్.)

31వ వార్షికోత్సవం

2023, జూన్ 20 - సా॥ 4:00 గం॥లకు

స్థలం: ఉస్మానియా గార్డెన్ ఫంక్షన్ హాల్, జామై ఉస్మానియా రైల్వేస్టేషన్ ఎదురుగా, అడిక్‌మెట్, హైదరాబాద్-500044

WATCH LIVE ON JOY CHERIAN YouTube facebook



ఆహ్వానించువారు : ప్రభువు దాసురాలు
జాయ్ చెరియన్ గారు
ఫౌండర్ - ప్రెసిడెంట్ & సీనియర్ పాస్టర్ - యు.పి.ఎఫ్ - హైదరాబాద్

అందరికీ ఆహ్వానము

వివరములకు: 9550504718, 9030757571

Our website: www.upf.org.in

# దేవుడు చేసిన అద్భుతకార్యములు

**1. స్వాతి, రామంతాపూర్:** నేను 2000 సం॥ నుండి యు.పి.ఎఫ్. సంఘానికి వస్తున్నాను. ప్రస్తుతం నేను యు.పి.ఎఫ్.లో స్టాఫ్‌గా పని చేస్తున్నాను. 20 మార్చి, 2023 నుండి నేను ఛాతి నొప్పితో బాధపడుతున్నాను. కూర్చొని ఉంటే బాగుంటుంది. కాని ఏదైనా పని చేసినా, నడిచినా నొప్పి ప్రారంభమవుతుంది. నేను డాక్టర్‌కి చూపించుకున్నాను. మందులు ఇచ్చారు. రెండు, మూడు రోజులు వేసికున్నాను కాని నొప్పి తగ్గలేదు. మళ్లీ వెళ్లి డాక్టర్‌కి చెబితే రెండు రోజులు ఇంజెక్షన్ ఇచ్చారు అయినా నొప్పి తగ్గలేదు. నేను వెంటనే అమ్మగారికి ఫోన్ చేసి ఇలా ఉంది నా పరిస్థితి అని చెప్పాను. అమ్మగారు గద్దించి చెస్ట్‌పెయిన్ ఉంటే ఎందుకు అశ్రద్ధ చేస్తున్నావు అని ఒక డాక్టర్ పేరు ఇచ్చారు, అక్కడ చూపించుకున్నాను. అక్కడ చెస్ట్‌కి సంబంధించిన అన్ని పరీక్షలు చేశారు. నిరంతర ప్రార్థనలో ప్రార్థన విన్నపం ఇచ్చాను. సంఘమంతా, అలాగే అమ్మగారు నా గురించి ప్రార్థన చేశారు. దేవుని మహాకృపవలన రిపోర్టులన్నీ నార్మల్‌గా వచ్చాయి. ఆత్మీయ తల్లిగారు ప్రతిరోజు ఫోన్ చేసి నా ఆరోగ్య పరిస్థితి కనుగొంటూ నన్ను చాలా ధైర్యపరచారు. అమ్మగారికి వందనాలు. సమస్త ఘనత మహిమ దేవునికే చెల్లునుగాక!.

**2. ప్రతిభ, అనకాపల్లి:** కొంతకాలం క్రితం మా నాన్న గారికి రాత్రిపూట జ్వరం వస్తూ పోతూ ఉంది. మందులు అయితే వేస్తున్నాము. ఆసుపత్రికి వెళ్దామంటే అస్సలు ఒప్పుకోలేదు. నేను యు.పి.ఎఫ్. నిరంతర ప్రార్థనలో ప్రార్థన విన్నపం ఇచ్చాను. నాన్నగారి వయస్సు 76 సంవత్సరాలు. బి.పి., షుగర్, హార్ట్ పేషెంట్. నిరంతర ప్రార్థనలో ప్రార్థన చేశారు. దేవుని మహా కృపను బట్టి సంఘప్రార్థనద్వారా నాన్నగారికి జ్వరం తగ్గిపోయింది. కేవలం ప్రార్థనద్వారానే నాన్న స్వస్థత పొందారు. అమ్మగారు ఇంతగొప్ప అనుకూలతను ఏర్పాట చేయడం చాలా ఆశీర్వాదకరంగా ఉంది. దేవునికే సమస్త మహిమ కలుగునుగాక!

**3. రోసిలిన్ జాకబ్ :** నేను మాయింటి బయట కాలుజారి పడ్డాను. ఇదివరకు ఒకసారి ఇలాగే పడ్డాను. ఇది రెండోసారి తలకి బాగా దెబ్బ తగిలింది. పెద్ద చప్పుడు వచ్చింది. పడిన వెంటనే అలాగే కూర్చొని దేవుని స్తుతించి ప్రార్థించాను. అక్కడ ఉన్నవాళ్లందరు ఆసుపత్రికి వెళ్లండి, తలకి బాగా దెబ్బ తగిలింది అన్నారు. కాని నాకు ఆసుపత్రి అంటే భయం మరియు నమ్మకం కూడా లేదు. మందులు తీసికోవద్దు అనే వ్యతిరేకత ఏమీ లేదుగాని నా విశ్వాసం ఏమిటంటే నా ప్రతి పరిస్థితి దేవుడు ఎరిగినవాడు. ఆయనకు అసాధ్యం అంటూ ఏమీ లేదు. నా విశ్వాసాన్ని దేవుడే బలపరుస్తాడు. తల భయంకరమైన నొప్పిగా ఉంది. నేను ప్రతి రోజు యూ ట్యూబులో అమ్మగారి మెసేజీలు వింటూ నా సమయాన్ని గడిపేదాన్ని. వాక్యం చదువుకుంటూ, పాటలు పాడుకుంటూ, స్వస్థత వాగ్దానాలు చదువుతూ నేను దేవుడిని ఒక్కటే అడిగాను. తండ్రీ, నీవు నన్ను సృజించినవాడవు. నీ పని తప్ప నేనేపని చేయటం లేదు. నీపని నేను చేస్తున్నప్పుడు నన్ను బాగుచేయవలసినవాడవు నీవే, నేనైతే డాక్టర్ల దగ్గరకు వెళ్లను నన్ను జ్ఞాపకం చేసికోమని విశ్వాసంతో ప్రార్థించాను. అప్పుడు జాయ్ అమ్మగారికి చెబితే దేవుడు ఎవరికీ రుణపడి ఉండే దేవుడు కాదు అన్నప్పుడు, నిజమే నేను దేవుని చెంత ఉన్నాను. దేవుని కౌగిట్లో, అర చేతిలో ఉన్నాను నా తలలో ఏముందో నాకైతే తెలీదు. ఏ నొప్పి ఉన్నా నీవు బాగు చేసే దేవుడవు అని ప్రార్థిస్తున్నాను. దేవుడు నా విశ్వాస్యతను బలపరచాడు సంపూర్ణ స్వస్థత ఇచ్చాడు. ఈ 24 గం॥ల ప్రార్థన అనేది దేవుడు నాకొరకే ఏర్పాటు చేశాడు. ఎందుకంటే నా చిన్నప్పటినుండి యేసయ్య అంటే నాకు చాలా ఇష్టం. నాకు ఎంత కష్టం వచ్చినా, ఎన్ని శ్రమలు వచ్చినా అన్నీ దేవుడు చూస్తున్నాడు. ఆయన సెలవు లేకుండా ఏదీ నాకు జరగలేదు. ఈ శ్రమల్లో నా దేవుడు నాకు తోడైయున్నాడనే విశ్వాసంతో నా విశ్వాస యాత్రను కొనసాగిస్తున్నాను.

ఈ 24 గం॥ల ప్రార్థనల్లో ప్రతిరోజు అమ్మగారు, పాస్టర్లు అందించే వాక్యాలు, జీవపు మాటలుద్వారా మన ఆత్మలకు, శరీరాలకు ఆరోగ్యం, సంతోషం దొరుకుతుంది. జీవితం ఎంతగానో ఆశీర్వదింపబడుతుంది. దేవునికే సమస్త మహిమ చెల్లును గాక!

**4. మాధవి జోనాథన్ :** నాది మార్కెటింగ్ ఫీల్డ్. 10 గం॥లు నిలబడే పనిచేస్తాను. నాకు ఓసారి అకస్మాత్తుగా జ్వరం వచ్చింది. అప్పుడు జూమ్‌లో ప్రార్థన విన్నపం తెలియజేశాను. మందులు వేసికుంటున్నాను కాని జ్వరం తగ్గుతుంది మళ్లీ వస్తుంది. ఎందుకిలా అవుతుందని కంప్లీట్ బాడీ చెకప్‌కి వెళ్లాను. అక్కడి మేడమ్-బరువు చాలా తక్కువగా ఉన్నావు, ప్లేట్‌లెట్స్ కౌంట్‌కూడా బాగా తగ్గిపోయింది, టి.బి. లక్షణాలుకూడా కనబడుతున్నాయి. ఎందుకైనా మంచిది ఒకసారి పరీక్ష చేయించుకో అన్నారు. అలాగే చేయించుకున్నాను రిపోర్టులో పాజిటివ్ అని వచ్చింది. మా ఇంట్లో నేను పనిచేయకపోతే గడవదు. నాకొక చిన్న బాబు ఉన్నాడు. ఇంట్లో పనులన్నీ చేసి బాబుని అక్కవాళ్ల యింట్లో వదిలి నా ఉద్యోగానికి వెళ్తాను. మళ్లీ నేను రాత్రి వచ్చేటప్పుడు బాబుని తెచ్చుకుంటాను. ఇప్పుడు నాకు ఇలాంటి పరిస్థితి ఏంటి ప్రభువా అని చాలా ఏడ్చి ప్రార్థించి, ఇప్పుడు నేనేమి చేయాలో నాకేమీ అర్థం కావటంలేదని చెప్పి మూడు రోజులు ఉపవాసంలో ఉన్నాను. ప్రస్తుతం నా వయస్సు 27 సం॥లు ఇంత చిన్న వయస్సులో నాకే ఎందుకిలా అవుతుంది అని చాలా క్రుంగిపోయాను. ఉద్యోగ స్థలంలో నా పరిస్థితి గురించి చెబితే - ఏంటి అమ్మా ఊరకే జ్వరం అంటావు రెండు నెలలుగా ఇదే చెబుతున్నావు. నీ ప్లేస్‌లో వేరేవాళ్లను పెట్టుకుంటాము అన్నారు. నాకు జాబు చాలా అవసరం. కాని జ్వరం తగ్గటం లేదు. నేను మళ్లీ చెకప్‌కి వెళ్లాను ఇంతకు ముందు పాజిటివ్ అన్న మేడం టి.బి. ఏమీ లేదమ్మా ఉన్నట్టుండి బరువు ఎలా పెరిగావు అని ఆశ్చర్యపోయారు. దేవుడు అనుకొనని రీతిగా అద్భుతంగా నా ప్రార్థన విని టి.బి. రిపోర్టు నెగిటివ్ చేశాడు. ప్రార్థించిన యు.పి.ఎఫ్. సంఘానికి, ప్రేయర్ వారియర్స్‌కి నా కృతజ్ఞతలు. దేవునికే సమస్త మహిమ చెల్లును గాక!

**5. సుధారాణి :** మా పెద్దమ్మకు నడుము ఆపరేషన్ అన్నారు. అప్పుడు నేను యు.పి.ఎఫ్. సంఘానికి ప్రార్థన విన్నపం ఇచ్చాను. దేవుడు అద్భుతంగా ఆపరేషన్ విజయవంతం చేశాడు. పెద్దమ్మ క్షేమంగా ఇంటికి వచ్చింది.

ఈలోపు మా పెదనాన్న ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యాడు. డాక్టర్లు అతనికి స్టెంట్ వేయాలని అంటున్నారు. నేను వెంటనే యు.పి.ఎఫ్. సంఘానికి ఫోన్ చేసి పెదనాన్న గురించికూడ ప్రార్థన విన్నపం తెలియజేశాను. దేవుడు పెదనాన్న విషయంలోకూడా అద్భుతంగా గొప్ప కార్యం జరిగించాడు. నేనుకూడా ఉపవాసముతో మా పెదనాన్న గురించి ప్రార్థించాను. ఆపరేషన్ అయ్యాక చెప్పారు స్టెంట్ వేయలేదు కాని బైపాస్ సర్జరీ చేశామని. నేను ఆందోళనపడతానని ఆ విషయం చెప్పలేదట - మా కుటుంబ సభ్యులు చెప్పారు. కేవలం యు.పి.ఎఫ్. ప్రార్థనలద్వారా మా కుటుంబంలో గొప్ప కార్యం జరిగింది. సమస్త మహిమ దేవునికే చెల్లునుగాక.

**6. డా. సిల్వియా రెడ్డి :** నేను యు.పి.ఎఫ్.లో చిన్న వాలంటీర్‌గానైనా పని చేయాలని ఆశపడేదాన్ని. నేను 15 సం॥రాలుగా టీచింగ్ ఫీల్డ్‌లో ఉన్నాను. జూనియర్, డిగ్రీ కాలేజీల్లో చెబుతుంటాను. ఒక రోజు యు.పి.ఎఫ్.లో వి.బి.యస్. టీచర్స్ అవసరమని ప్రకటన చేశారు. నేను వెంటనే అప్లికేషన్ ఇచ్చాను. దేవుని మహా కృపనుబట్టి నేను సెలెక్ట్ అయ్యాను. ఈ అవకాశం ఇచ్చిన జాయ్ అమ్మ గారికి నా వందనములు. నేను ఫిట్‌నెస్ ట్రైనర్‌ని. నాకు ఒక చిన్న క్లినిక్ ఉంది. అందులో అందరికి వ్యాయామం చేయిస్తుంటాను, నేనొకసారి దేవా, నాకు భారతదేశంలోని చాలామంది క్లయింట్లు కావాలి, నా క్లినిక్ చాలా అభివృద్ధి పొందాలని ప్రార్థన చేశాను. అయితే మనం ఊహించేదొకటి దేవుడు చేసేది మరొకటి. అంటే మనం ఊహించేదానికంటే అడుగుదానికంటే అత్యధికముగా దయచేయు దేవుడు. దేవుడు నాకు చాలామంది అమెరికన్ క్లయింట్లను ఇచ్చాడు. ఇప్పుడు నా జీతం నాలుగు రెట్లు అయింది. దేవునికి స్తోత్రములు. అమ్మగారికి వందనాలు.

**7. సుజాత, చర్లపల్లి :** మా మరిది పేరు ఉదయ్. అతని వయస్సు 11 సం॥లు. 2023, మార్చి 8వ తేదీ నుండి అతనికి మూడు రోజులుగా ఒకటే దగ్గు జ్వరం వస్తుంది. జలుబువలన శ్వాస తీసికోవడానికి చాలా కష్టంగా ఉంది. అప్పుడతనిని దగ్గరలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసికొని వెళ్లారు. డాక్టరు పరీక్షలన్నీ చేసి తెల్లరక్తకణాలు తగ్గిపోయాయి. రక్తంలో ఇన్ఫెక్షన్ ఉంది. స్టమక్ ఇన్ఫెక్షన్ కూడా ఉంది. పరిస్థితి చాలా విషమంగా ఉంది అని చెప్పారు. కాని వాళ్లది చాలా పేద కుటుంబం. మేము ఇక్కడ అడ్మిట్ కాలేము, మందులు ఇవ్వండి అని చెప్పారు.

నేను వెంటనే నిరంతర ప్రార్థనలో ప్రార్థన విన్నపం ఇచ్చాను. ప్రేయర్ వారియర్స్ ప్రార్థించారు. మందు వేసుకున్న కొంత సేపటికి మా మరిదికి సంపూర్ణ స్వస్థత వచ్చింది. ఇప్పుడు బాబు స్కూలుకికూడా వెళ్తున్నాడు. నిరంతర ప్రార్థనద్వారా బాబు స్వస్థత పొందినందుకు దేవునికి స్తోత్రములు యు.పి.ఎఫ్. సంఘానికి, జాయ్ అమ్మగారికి మా నిండు వందనములు.

**8. అఖిల :** నేను 10వ తరగతి చదువుతున్నప్పటినుండి యు.పి.ఎఫ్. సంఘానికి వస్తున్నాను. 9-5-2022న నా వివాహం జరిగింది. దేవుని కృపవలన రెండు నెలలకే గర్భము దాల్చాను. 2023, ఏప్రిల్‌లో డెలివరి అయింది. దేవుడు నాకు అందమైన ఆడపిల్లని బహుమానంగా ఇచ్చాడు. డిశ్చార్జి అయి ఇంటికి వచ్చిన తర్వాత ఆపరేషన్ కుట్లువేసిన ప్రాంతంనుండి చీము కారడం వలన మళ్లీ రీ-అడ్మిట్ అవడం జరిగింది. చీము కారడం వలన కుట్లు అన్నీ ఊడిపోయాయి. ఈ విషయం అమ్మగారికి ఫోనుద్వారా తెలియజేశాను. దేవుని మహా కృపవలన మెల్లగా స్వస్థత చేకూరి అంతా సర్దుకుంది. ఎటువంటి హాని కలుగలేదు. సంఘ ప్రార్థన, అమ్మగారి ప్రార్థన వలన నేను సంపూర్ణ స్వస్థత పొందాను. అమ్మగారికి వందనాలు. దేవునికి వేలాది స్తోత్రములు.

**9. కృప శరత్, కర్మాన్‌ఘాట్ :** నేను 2023, ఫిబ్రవరి నెలనుండి జూమ్ ప్రార్థనల్లో పాల్గొంటున్నాను. నేను ఏప్రిల్ నెలలో డ్యూటీలో రీజాయిన్ అవుతున్నాను. ఆ సమయంలో ఎటువంటి ఇబ్బంది రాకూడదని యు.పి.ఎఫ్. సంఘానికి ప్రార్థన విన్నపం ఇచ్చాను. మా అమ్మ అప్పటికే 5 నెలల వయస్సున్న మనవడిని చూసుకొంటుంది. ఇప్పుడు అమ్మ మా పాపని కూడా చూసికోవాలి. చాలా మంది సహోదరీలు జూమ్‌ద్వారా నా గురించి నా కుటుంబంగురించి ప్రార్థన చేశారు. నేను ఏప్రిల్ నెలలో ఉద్యోగంలో చేరాను. దేవుడు మా అమ్మకి బాబుని, పాపని చూసికోనే చక్కని శక్తిని ఇచ్చాడు. అలాగే నా కుటుంబముతో పాటు నేను సిలువధ్యానాల్లోకూడా పాల్గొన్నాను.

దేవుడు నన్ను ఆశీర్వదించి ద్విచక్ర వాహనం అనుగ్రహించాడు. నేను దాన్ని నడపటం కూడా నేర్చుకున్నాను. దేవునికి స్తోత్రములు. ప్రార్థించిన సంఘానికి వందనములు.

**10. జాయ్ వెస్లీ :** నా భర్త అశ్విన్ వెస్లీ గారికి గత కొన్ని రోజులనుండి జ్వరం వస్తుంది. జ్వర తీవ్రత $104^0$ నుండి $105^0$ వరకు వస్తుంది. ప్లేట్‌లెట్స్ సంఖ్యకూడా బాగా తగ్గిపోయింది. అప్పుడు నేను డాక్టర్‌ని సంప్రదిస్తే ఏమీ లేదు మందులు వేయండి. వైరల్ ఫీవర్ కావచ్చు అన్నారు. ఎందుకంటే అశ్విన్ ఈ మధ్య రివ్యూ చెకప్‌కి వెళ్లాడు అందుకే జ్వరం వచ్చినట్లుంది అని చెప్పారు. ఎన్ని మందులు ఇచ్చినా జ్వరం మాత్రం తగ్గటంలేదు. తన కదలికలుకూడా చాలా విచిత్రంగా కనిపించాయి. కళ్లు తెరచి పడుకోవడం, నోరుకూడా సరిగ్గా తెరవకపోవడం, సరిగా తినకపోవడం వంటి చర్యలు ఉండేవి. అప్పుడు డాక్టర్ రక్తపరీక్ష చేస్తే ప్లేట్‌లెట్స్ సంఖ్య 1,70000 నుండి 89,000 కి తగ్గిపోయింది. అప్పుడు డాక్టర్ 89,000 ఉంటే ఫర్వాలేదు రెండు రోజుల తర్వాత మళ్లీ టెస్ట్ చేస్తామని చెప్పారు. రెండు రోజుల తర్వాత టెస్ట్ చేస్తే ప్లేట్‌లెట్స్ సంఖ్య 63,000కి తగ్గింది. ఈ విషయం నేను డాక్టర్‌కి ఫోను చేసి చెబితే వెంటనే అశ్విన్‌ని తీసికొని రమ్మన్నారు. ఆసుపత్రిలో అడ్మిట్ చేసికున్నారు. మరుసటి రోజు పరీక్షిస్తే ప్లేట్‌లెట్స్ సంఖ్య 1,50,000కి పెరిగిపోయింది. అడ్మిట్ అయిన 24 గంటల్లోనే ప్లేట్‌లెట్స్ సంఖ్య ఇంతగా పెరిగిందంటే అది ప్రార్థన వల్లనే అని నమ్ముతున్నాను. ఎందుకంటే అడ్మిన్ చేసే ముందు అంబులెన్స్‌లో కూర్చున్నప్పటి నుండి జాయ్ అమ్మగారికి మెసేజి ఇస్తున్నాను. అమ్మగారు వాగ్దానం ఇవ్వడం జరిగింది. యు.పి.ఎ.ఫ్. ప్రార్థనలు, అమ్మగారి ప్రార్థనవలననే నా భర్త జ్వరం పూర్తిగా తగ్గిపోయి స్వస్థత చేకూరింది. దేవునికే సమస్త మహిమ, ఘనత, ప్రభావము చెల్లును గాక!

**11. అజిత జాయ్‌సి, D/o. డా॥ టి. శకుంతల, విజయవాడ:** మేము ఇద్దరము రాంనగర్‌లోని యు.పి.ఎఫ్. మందిరానికి వచ్చి అమ్మగారిని వ్యక్తిగతముగా కలిసి కౌన్సెలింగ్ చేయించుకొన్నాము. అమ్మగారు ప్రార్థించాక దేవుడు నా జీవితంలో గొప్పకార్యము చేశాడు. అమ్మగారు ఫాదర్ దేవయ్య ఆడిటోరియంలో బ్రదర్ ఏనోష్ గారు ఏర్పాటు చేసిన కూడికలోకూడా మా ఇద్దరికొరకు ప్రార్థించారు. నా స్థూలకాయం, జుట్టు ఊడటం, ఉద్యోగం కొరకు ప్రార్థించి **“ఇదిగో నేనొక నూతనక్రియ చేయుచున్నాను ఇప్పుడే అది మొలుచును మీరు దాని నాలోచింపరా? నేను అరణ్యములో త్రోవ కలుగజేయుచున్నాను ఏడారిలో నదులు పారజేయుచున్నాను.”** – యెషయా 43:19 అనే వాగ్దానము ఇచ్చారు. నేను అమ్మగారి ఆదేశానికి విధేయత చూపి ఆ వాగ్దానాన్ని వెయ్యిసార్లు వ్రాసినప్పుడు ప్రభువు నాకు సంతృప్తి కలిగించే ఉద్యోగము ఇచ్చాడు. మరియు యు.ఎస్.ఎ. నందు మంచి జీవిత భాగస్వామిని ఇచ్చి ఆశీర్వదించాడు. నిజముగా ప్రభువు నా జీవితంలో అద్భుతకార్యము జరిగించాడు. అమ్మగారి ప్రార్థనలద్వారా నన్నెంతో ఆశీర్వదించాడు. నేను అమ్మగారిని కలిసినప్పుడు నా పరిస్థితి నిరాశనిస్పృహలలో ఉంది. నా పరిస్థితులను చూస్తున్నప్పుడు నా జీవితాన్ని ముగించాలని అనుకొన్నాను. నేను నా తలిదండ్రులకు భారముగా ఉన్నాననుకొన్నాను. కాని అమ్మగారి ప్రార్థనలు నన్నెంతో ధైర్యపరచినవి, ఇంటర్వ్యూకు హాజరౌటకు ఆశ కలిగించినది, వివాహము చేసికొనుటకు నన్ను బలపరచినది. నా జీవితంలో సర్వశక్తుడైన దేవుడు చేసిన అద్భుతకార్యములనుబట్టి దేవునికి స్తుతులు చెల్లిస్తున్నాను. ఎంతో తీరికలేని కార్యక్రమాల్లో ఉంటూకూడా నా హృదయ వేదన విని నన్ను ఓదార్చి నాకొరకు అమూల్యమైన ప్రార్థనలు చేసిన అమ్మగారికి నేనెంతో కృతజ్ఞురాలిని. ❀

## వి.బి.ఎస్. (వెకేషన్ బైబిల్ స్కూల్)

యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో 2023, ఏప్రిల్ 27 నుండి మే 6 వరకు ప్రతిరోజు ఉదయం 7 గం॥ల నుండి 10 గం॥ల వరకు 10 రోజుల వెకేషన్ బైబిల్ స్కూల్ యు.పి.ఎఫ్. రాంనగర్ ఆలయంలో ఎంతో జయకరంగా జరిగింది. “జయించుటకు జన్మించాను” అనే అంశముపై 4 నుండి 13 సంవత్సరముల మధ్య వయస్సు గల బాలబాలికలకు బైబిల్ పాఠములు బోధింపబడినవి. ప్రతిరోజు ఆరాధన, ఆటలు, క్విజ్, యాక్టివిటి, పప్పెట్ షో, రోల్ ప్లే, ఇతర పోటీలు నిర్వహించబడినవి. ప్రతిరోజు స్నాక్స్, మే 6 2023న భోజన ఏర్పాట్లు చేయబడినవి. 2023 మే 7వ తేదీ ఆదివారము సాయంకాల ఆరాధనలో వి.బి.ఎస్. వాలిడిక్టరీ ఫంక్షన్, వి.ఎస్.టి. బాగ్‌లింగంపల్లి నందు ఎంతో జయకరంగా జరిగింది. సాంస్కృతిక కార్యక్రమాలు, బహుమతుల ప్రదానోత్సవం జరిగింది. దాదాపు 300 మందికి పైగా చిన్నపిల్లలు పాల్గొన్ని ఆశీర్వదింపబడ్డారు.

## వి.బి.సి. (వెకేషన్ బైబిల్ కాలేజి)

యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో 2023, మే 22 నుండి మే 27 వరకు ప్రతిరోజు ఉదయం 7 గం॥ల నుండి 11 గం॥ల వరకు 6 రోజుల వెకేషన్ బైబిల్ కాలేజి రాంనగర్ యు.పి.ఎఫ్. ప్రార్థన గోపురంలో ఎంతో జయకరంగా జరిగింది. ఆరాధన, దిన ధ్యానం, ఆటలు, క్విజ్, యాక్టివిటి, మొదలైన కార్యక్రమాలు జరిగినవి. యోసేపు జీవితం (గోతి నుండి రాజభవనానికి) అనే అంశముపై వర్తమానములు అందించబడినవి. ప్రతిరోజు స్నాక్స్, మే 27, 2023 న ప్రేమవిందు ఏర్పాటు చేసి పాల్గొన్న వారందరికి బహుమతులు అందించబడినవి. 13 సంవత్సరాలు మొదలుకొని 25 సంవత్సరాల వయస్సు గల దాదాపు 60 మందికి పైగా యౌవనస్థులు పాల్గొని ఆశీర్వదింపబడ్డారు. 2023 మే 28, ఆదివారము సాయంకాల ఆరాధనలో వి.బి.సి. వాలిడిక్టరి ఫంక్షన్ ఎంతో జయకరంగా జరిగింది. స్కిట్స్, వీడియో ప్లే, కొరియోలు, సాక్ష్యములు మొదలైన ప్రత్యేక కార్యక్రమములు జరిగినవి.

## 24 గంటల స్తుతి ఆరాధన

కీ॥శే॥ పాస్టర్ ఎ.ఎన్. మాథ్యూస్ గారి 20వ వర్ధంతి సందర్భముగా 2023 జూన్ 13, మంగళవారము ఉదయం 6 గంటల నుండి జూన్ 14, బుధవారం ఉదయం 6 గంటల వరకు నిరంతర స్తుతి ఆరాధన యు.పి.ఎఫ్. ప్రార్థన గోపురంలో ఎంతో జయకరంగా జరిగింది. అమ్మగారు దైవదర్శనంతో, దూరదృష్టితో, ప్రార్థనతో తన తండ్రిగారైన పాస్టర్ ఎ.ఎన్. మాథ్యూస్‌గారు చేసిన సేవకై, తదనంతరం ఆ దర్శనం కొనసాగించుటకు దేవుడు తనను ఏర్పరచుకొన్నాడనే కృతజ్ఞతతో 24 గంటలు స్తుతి ఆరాధన ఆరంభించారు. యు.పి.ఎఫ్. వివిధ విభాగాల నుండి సిద్ధపాటుతో పాల్గొని దేవుని కీర్తించారు; పాటలు పాడి దేవుని ఆరాధించారు. 24 గంటలు నిరంతరాయంగా స్తుతులు చెల్లించుటకు కృపచూపిన యేసుక్రీస్తు ప్రభువునకు సమస్త మహిమ ఘనత ప్రభావములు కలుగును గాక.

## లీడర్‌షిప్ ప్రోగ్రామ్

యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో 2023 మే 19, 20 తేదీల్లో ఉ॥ 9 గం॥ల నుండి సా॥ 6 గం॥ల వరకు రెండు రోజులు యు.పి.ఎఫ్. ప్రార్థన గోపురంలో లీడర్‌షిప్ ప్రోగ్రామ్ ఎంతో జయకరంగా జరిగింది. Lead like Jesus టీం వారు పాల్గొని ఎన్నో యాక్టివిటీలు, ఉపన్యాసాలు, ఉదాహరణతో “యేసు ప్రభువు వలె నడిపించు” అనే అంశము బోధించి తర్ఫీదు ఇచ్చారు. యు.పి.ఎఫ్. నుండి ముప్పై మంది తర్ఫీదు పొందారు. వారికి ప్రతిరోజు టీ, ప్రేమవిందు ఏర్పాటు చేయబడింది. మే 20వ తేదీన అమ్మగారు పాల్గొని ప్రార్థించి తర్ఫీదు పొందినవారిని ప్రోత్సహించారు.



# యు.పి.ఎఫ్. ఆధ్యాత్మిక రచనలు

జాయ్ చెరియన్ గారు రచించిన పుస్తకములు మీకు అందుబాటులో ఉన్నవి. యు.పి.ఎఫ్. ఆఫీసులో మీకు లభ్యమగును. పోస్టుద్వారా కావలసినవారు పుస్తకాల వెలతోపాటు పోస్టల్ ఛార్జీ అదనంగా యం.ఓ. ద్వారా పంపగలరు.

**ఈ క్రింది పుస్తకములు కావలసినవారు మా చిరునామాను సంప్రదించండి :**

**"దేవుని వెయ్యి నామములు" - Vol - I to X** — వెల రూ. 150/-
1–100 ప్రసంగాల పుస్తకము (తెలుగు) — **(each one)**

**"దేవుని వెయ్యి వాగ్దానములు" - Vol - I** — వెల రూ. 150/-
1–100 ప్రసంగాల పుస్తకము (తెలుగు)

**"దేవుని వెయ్యి ఆదేశములు" - Vol - I to III** — వెల రూ. 150/-
1–100 ప్రసంగాల పుస్తకము (తెలుగు) — **(each one)**

**"హృదయ పరీక్ష"** 40 ప్రసంగాల పుస్తకము (తెలుగు) — వెల రూ. 150/-

**"అద్భుత కార్యములు" - Vol - I to IV** — వెల రూ. 150/- **(each one)**

**"విశ్వాసి యాత్ర కీర్తనలు"** (1000 పాటలు) — వెల రూ. 150/-

**"జీవపు మాటలు" పుస్తకము** (తెలుగు మరియు ఇంగ్లిషు) — వెల రూ. 20/-
**"దైవిక స్వస్థత" పుస్తకము** (తెలుగు మరియు ఇంగ్లిషు) — వెల రూ. 20/-
**"నన్ను మలిచిన నా దేవుడు"** జాయ్ చెరియన్‌గారి అనుభవసాక్ష్యము(తెలుగు) — వెల రూ.20/-
**"పక్షిరాజు" పుస్తకము** (తెలుగు మరియు ఇంగ్లిషు) — వెల రూ. 20/-
**"రహస్య పాపములు" పుస్తకము** (తెలుగు) — వెల రూ. 20/-
**"అమ్మ మాటలు" పుస్తకము** (తెలుగు) — వెల రూ. 20/-
**"మండుచున్న కాగడ" పుస్తకము** (దేవుని పరిచర్యలో స్త్రీలు)(తెలుగు) — వెల రూ. 20/-
**"తల్లి ఒప్పకోలు" పుస్తకము** (తెలుగు) — వెల రూ. 20/-
**"వెయ్యి నామములు" పుస్తకము** (ఇంగ్లిషు మరియు తెలుగు) — వెల రూ. 20/-
**"వెయ్యి వాగ్దానములు" పుస్తకము** (ఇంగ్లిషు మరియు తెలుగు) — వెల రూ. 20/-
**"వెయ్యి ఆదేశములు" పుస్తకము** (ఇంగ్లిషు మరియు తెలుగు) — వెల రూ. 10/-
**"మందిరముకొరకు వాగ్దానములు"** (ఇంగ్లిషు మరియు తెలుగు) — వెల రూ. 10/-
**"మనము దేనికొరకు ప్రార్థించాలి"** (ఇంగ్లిషు మరియు తెలుగు) — వెల రూ. 10/-
**"నూతన సంవత్సర క్యాలెండరు"** (తెలుగు మరియు ఇంగ్లిషు) — వెల రూ. 60/-

## విశ్వాసులకు విజ్ఞప్తి



**క్రీస్తునందు ప్రియ విశ్వాసులారా,**

నేను ఒక ముఖ్యమైన కార్యము మీతో పంచుకోవాలని ప్రేరణ కలిగియున్నాను. ప్రార్థనకూడా చేయాలని మిమ్మును కోరుతున్నాను. ఎందుకంటే ప్రార్థన అద్భుతాలు చేస్తుంది. ప్రార్థించినప్పుడే మనము ప్రభువుకొరకు గొప్పకార్యాలు చేయగలము. మనము మానవులము కాని దేవుడు తన ఆత్మతో మనలను నింపి దేవునికొరకు ఘనమైన కార్యాలు చేయడానికి వాడుకొంటాడు. **"తమ దేవుని నెరుగువారు బలము కలిగి గొప్ప కార్యములు చేసెదరు."** – దానియేలు 11:32

యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ (యు.పి.ఎఫ్.) 28 సంవత్సరముల నుండి ప్రజలకు సేవలు అందిస్తుంది. యు.పి.ఎఫ్.కు ఒక సొంత మందిరమంటూ లేదు. ఇంతవరకు ఆరాధన మందిరం కట్టబడలేదు కాని మా తండ్రి పాస్టర్ ఎ.ఎన్. మాథ్యూగారు నిర్మించిన ఆలయంలో ఆరాధన జరుగుతూ వచ్చింది. పట్టజాలనంత జనాలు వచ్చినప్పుడు ఫంక్షన్ హాల్స్‌లో ఆరాధనలు జరిపించాము. కాని ఇప్పుడు సమయం వచ్చింది. తప్పకుండా యు.పి.ఎఫ్.కు ఒక ఆలయం నిర్మించాలని ప్రభువు నన్ను ప్రేరేపించాడు. సరియైన స్థలం కొనాలి; మందిరం నిర్మాణం చేయాలి; దేవుడు సహాయకులను మంచి ఆలోచనకర్తలను అనుగ్రహించాలి. పెద్దలందరు కూడి ఈ కార్యాన్ని చేయాలని ప్రార్థిస్తున్నాను.

ఇటీవల యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ ట్రస్ట్ బిల్డింగ్ ఫండ్ అని ఒక అకౌంట్ ఏర్పాటు చేశాము. ఎవరినీ బలవంతము చేయడం లేదు. ఇది దైవకార్యము. మీకు ప్రేరణ కలిగిన కొలది దైవకార్యానికి పవిత్రమైన, సంపూర్ణమైన హృదయంతో ఇవ్వాలి. ఎవరి ఒత్తిడిచేతగాని, బలవంతముచేత గాని మనము ఇవ్వకూడదు. కాబట్టి నేను దేవునికి ప్రార్థన చేస్తున్నాను; మీకు తెలియజేస్తున్నాను. దేవుడు మిమ్మును ప్రేరేపించి కార్యము చేయాలి. దేవుడు మిమ్మును ప్రేరేపించిన కొలది ఈ అకౌంట్‌లో మీరు మీ విలువైన విరాళాలు పంపిస్తే ప్రతిపైసా భద్రంగా పొందుపర్చి తప్పకుండా మందిరనిర్మాణానికి వినియోగిస్తామని తెలియజేస్తున్నాను. ఒకవేళ మీరు ఇతర యు.పి.ఎఫ్. బ్యాంక్ ఖాతాల్లోకి పంపినా అది యు.పి.ఎఫ్. బిల్డింగ్ ఫండ్ అకౌంట్‌లోకి ట్రాన్స్‌ఫర్ చేస్తామని తెలియజేస్తున్నాను.

ముఖ్యంగా మీరు ఈ కార్యంకొరకు ప్రార్థన చేయాలి. యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్‌ద్వారా ఆశీర్వదింపబడినవారు కోకొల్లలుగా ఉన్నారు. మనము ఎక్కువగా ప్రకటనలు చేసి ఎప్పుడూ గొప్పలు చెప్పుకోలేదు. దేవుడు మన ప్రయత్నాలు చూస్తున్నాడనే విశ్వాసం నాకు ఉన్నది. 31 సంవత్సరాలు మీరు యు.పి.ఎఫ్. ద్వారా ఆశీర్వదింపబడ్డారు. కావున మీరు తప్పకుండా యు.పి.ఎఫ్. యెడల కృతజ్ఞులైయుండాలి. దీవింపబడినవారికి నేను తెలియజేస్తున్నాను. మీకు తప్పకుండా యు.పి.ఎఫ్. పట్ల ఒక కర్తవ్యం ఉంది. తప్పకుండా మీరు మీ శాయశక్తుల సహాయపడాలి. నేను ప్రభువు ప్రేరణతో మీకు ఈ విషయం తెలియజేస్తున్నాను. ప్రభువు–**"నన్ను ప్రేమించువారిని ఆస్తికర్తలుగా చేయుదును వారి నిధులను నింపుదును."** – సామెతలు 8:21 అనే వాగ్దానమును నాకు గుర్తు చేశాడు. మనము ప్రభువును ప్రేమిస్తున్నాము; సేవిస్తున్నాము; ఆయన మాటకు విధేయులౌతున్నాము కావున తప్పకుండా ఈ కార్యం జరుగుతుందని నేను విశ్వసిస్తున్నాను. మీరుకూడా దేవుడు నా దర్శనం నెరవేర్చునట్లు ప్రార్థించాలని కోరుతున్నాను. దేవునికి సమస్తం సాధ్యమని నేను హృదయపూర్వకముగా నమ్ముచున్నాను. దేవుడు మిమ్ముల నందరినీ ఆశీర్వదించును గాక!

## United Peoples Fellowship Trust Building Fund Account

Bank and Account Details

**Account Name : United People's Fellowship Trust Building Fund**

**A/c No. : 630501062130** **Bank : ICICI - Himayat Nagar Branch** **IFSC Code : ICIC0006305**

RNI. No. APTEL 2007/24270



## యు.పి.ఎఫ్. బ్యాంకు ఖాతాల వివరములు

**యు.పి.ఎఫ్. యూనియన్ బ్యాంకు ఖాతా వివరములు**

| | | |
|---|---|---|
| ఖాతా సంఖ్య | : | 13391110000946 |
| ఖాతా రకం | : | కరెంట్ ఖాతా |
| ఖాతా పేరు | : | యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ |
| ఖాతా శాఖ | : | రాంనగర్, హైదరాబాద్. |
| ఐ.ఎఫ్.ఎస్.సి. కోడ్ | : | UBIN0813397 |

**యు.పి.ఎఫ్. ఎస్.బి.ఐ. బ్యాంకు ఖాతా వివరములు**

| | | |
|---|---|---|
| ఖాతా సంఖ్య | : | 67088374386 |
| ఖాతా రకం | : | కరెంట్ ఖాతా |
| ఖాతా పేరు | : | యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ |
| ఖాతా శాఖ | : | రాంనగర్, హైదరాబాద్. |
| ఐ.ఎఫ్.ఎస్.సి. కోడ్ | : | SBIN0012917 |

**చెక్కులు : యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ పేరుతో**

(చెక్కు వెనుక మీ పేరు మరియు ఫోన్ నెంబర్ తప్పక వ్రాయగలరు)

**ఫోన్ పే / జీ.పే (గూగుల్ పే/తేజ్) : 7901236907**

**పి.ఓ.ఎస్ : కార్డ్ స్వైప్**

ప్రార్థించండి! **ప్రకటన** పాల్గొనండి!

## యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ (UPF)

**ఫోన్ : 9550504718, 9030757571**

**ఆదివారము ఆరాధనలు**

**"ఉదయకాల ఆరాధన మరియు సండే స్కూల్"**

ఉ॥ 6 గం॥ల నుండి ఉ॥ 9 గం॥ల వరకు

**"సాయంకాల ఆరాధనలు మరియు సండే స్కూల్"**

తెలుగు ఆరాధన: ప్రతి ఆదివారము సా॥ 6 గం॥ల నుండి రా॥ 9 గం॥ల వరకు

ఇంగ్లీష్ సర్వీస్ (జూమ్ లో మాత్రమే): ప్రతి ఆదివారము సా॥ 4 గం॥ల నుండి సా॥ 6 గం॥ల వరకు

**వి.ఎస్.టి. ఫంక్షన్ హాల్**, బాగ్ లింగంపల్లి రోడ్, హైదరాబాద్‌లో జరుగును.

YOUTUBE మరియు ZOOM ప్రత్యక్ష ప్రసారము (LIVE)

రాంనగర్ యు.పి.ఎఫ్. చర్చిలో డిజిటల్ సర్వీసు జరుగును.

ప్రతి రోజు **"ఉదయకాల ప్రార్థన" ఉ॥ 5 గం॥ల నుండి 7 గం॥ల వరకు**

ZOOM ప్రత్యక్ష ప్రసారము (LIVE)

**ఇతర వివరములకొరకు :**

9550504718, 9030757571 నెంబర్లను సంప్రదించగలరు.

| | | |
|---|---|---|
| Zoom Meeting ID | : | 9550504718 |
| Passcode | : | 7777 |

– జాయ్ చెరియన్

## యు.పి.ఎఫ్. ఆధ్యాత్మిక టి.వి. కార్యక్రమము

# "జీవపు మాటలు"

**కల్వరి** ఛానెల్‌లో

ప్రతి రోజు ఉ॥ 9.00 గం॥లకు మరియు రా॥ 10.30 ని॥లకు

**శుభవార్త** ఛానెల్‌లో

ప్రతి రోజు సోమ నుండి శుక్రవారము వరకు ఉ॥ 8.00 గం॥లకు

ప్రతి శుక్రవారము మ॥ 2.30 ని॥లకు

ప్రతి శనివారము మ॥ 12.00 గం॥లకు

**ఆరాధన** ఛానెల్‌లో

ప్రతి రోజు మ॥ 2.00 గం॥లకు

**నిరీక్షణ** ఛానెల్‌లో

ప్రతి రోజు ఉ॥ 10.00 గం॥లకు

జాయ్ చెరియన్ గారు దైవ వర్తమానమును అందించెదరు. వీక్షించి, దైవాశీర్వాదము పొందండి. ఈ కార్యక్రమము కొనసాగించుటకు ప్రార్థించండి, సహకరించండి.

ప్రభు సేవలో

– జాయ్ చెరియన్

మా చిరునామా :


## యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ (UPF)

# 1-9-52/E/3, రాంనగర్ ఈ-సేవ కు ఎదురుగా ఉన్న గౌతమ్ హైస్కూల్ వీధి, మూడవ కుడి మలుపు, రాంనగర్, హైదరాబాద్ - 20.

ఫోన్ : 9030757571, 9550504718

*VISIT US AT :*

*Email : joycherian@hotmail.com,*

Subscribe : Youtube 'Joy Cherian live'

వెబ్‌సైట్ : www.upf.org.in


ఆడియో ద్వారా ప్రసంగాలు వినాలన్నా, దేవుని వెయ్యినామముల ప్రసంగములు మీరు ఇంగ్లీషు భాషలో చదువవలెనన్నా, మా వెబ్‌సైట్‌ను దర్శించండి

Owned, Edited, Printed & Published by : JOY CHERIAN, United People's Fellowship,
# 1-9-52/E/3, Opp. Ramnagar e-seva Gowtham High School Lane, Third Right Turn,
Ramnagar, Hyderabad - 500 020, (T.S.), INDIA. Ph : 9550504718, 9030757571
Printed at : Sandhya Printing Works, # 1-7-1002/7/4/8, Ramnagar 'X' Road, Hyderabad - 500 020. Ph : 27619862